**బానిసత్వం వదిలేద్దాం రాజకీయ అధికారం చేపడదాం**




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

**ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ**




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 287 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- ఆదివారం 12 అక్టోబర్ 2025



## నోబెల్ శాంతి బహుమతి ఇమ్మని అడగలేదు

**- మచాడతో ఫోన్‌లో మాట్లాడనని ట్రంప్ వెల్లడి**


**- ఆమె పోరాటానికి తన మద్దతు ఉంటుందని ప్రకటన**

**వాషింగ్టన్,అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి బహుమతి దక్కకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా స్పందించారు. ఈ బహుమతి కోసం ట్రంప్ తహతహలాడిన విషయం తెలిసిందే. అయితే, ట్రంప్ 'శాంతి' ఆశలపై నీళ్లు చల్లుతూ 2025 నోబెల్ శాంతి బహుమతి వెనెజువెలా ప్రధాన ప్రతిపక్ష నాయకురాలు, ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న మరియా కొరీనా మచాడోకు నోబెల్ కమిటీ శుక్రవారం ప్రకటించింది. ఈ నేపథ్యంలో మిగతా2లో...

# వికసిత్ భారత్‌లో రైతులది ముఖ్య భూమిక

- ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను పండించాలి
- ఇతర దేశాలపై ఆధారపడకుండా స్వయంసమృద్ధి సాధించాలి
- జీఎస్‌టీ సంస్కరణతో రైతులు, గ్రామీణ రంగానికి ప్రయోజనం
- సాగు వ్యవయం తగ్గించేందుకు ఐదేళ్లలో రూ.13లక్షల కోట్ల సబ్సిడీ

**ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని ప్రారంభించిన మోడీ**



**న్యూఢిల్లీ,అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశం వికసిత్ భారత్ వైపు అడుగులు వేయడంలో రైతులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. భారత్ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే.. కేవలం వరి, గోధుమ పంటల పైనే కాకుండా ప్రొటీన్ అధికంగా లభించే పప్పులకు సంబంధించిన సాగును మరింత పెంచాలని రైతులకు సూచించారు. ప్రపంచ మార్కెట్‌లకు ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను పండించాలన్నారు. దేశంలో పంటల ఉత్పత్తికి అయ్యే ఖర్చులు తగ్గించి.. రైతుల ఆదాయం పెంచే దిశగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో పదేళ్లలో వ్యవసాయ రంగంలో కేవలం రూ.5 లక్షల కోట్ల సబ్సిడీలు ఇస్తే.. తమ ప్రభుత్వం పదేళ్లలో రైతులకు రూ.13 లక్షల కోట్లకు పైగా సబ్సిడీలు ఇచ్చిందని పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో శనివారం నాడు జరిగిన ప్రత్యేక కృషి ప్రోగ్రాంలో ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా గత నెలలో అమల్లోకి వచ్చిన జీఎస్‌టీ సంస్కరణతో రైతులు, దేశంలోని గ్రామీణ రంగానికి మరింత ప్రయోజనం చేకూరిందని మోదీ చెప్పారు. గత ప్రభుత్వాలకు వ్యవసాయంపై మిగతా2లో...

## హైకోర్టు స్టేతో సుప్రీంలో సవాల్

- 42శాతం బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం
- పార్టీ నేతలు, మంత్రులతో చర్చించిన సిఎం రేవంత్



**హైదరాబాద్,11 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీసీ రిజర్వేషన్ల పై సుప్రీంకోర్టుకి వెళ్లాలని నిర్ణయం తీసుకుంది. సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించనుంది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన జీవో 9 పై తెలంగాణ హైకోర్టు స్టే విధించడంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైకోర్టు తీర్పు ను స్టడీ చేసిన ప్రభుత్వం.. సీనియర్ కౌన్సిల్ తో సుప్రీంకోర్టు లో వాదనలు వినిపించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. అభిషేక్ మను సింగ్వి తో పాటు సిద్దార్థ దవే.. రిజర్వేషన్ల పై ప్రావీణ్యం కలిగిన అడ్వకేట్ లతో వాదనలు వినిపించాలని నిర్ణయించినట్లు సమాచారం. హైకోర్టు స్టే నేపథ్యంలో స్థానిక మిగతా2లో...

## ఉప్పాడ కాలుష్యంపై చర్యలు

**- కాలుష్య నియంత్రణ అధికారులతో పవన్ చర్చలు**



**అమరావతి,అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉప్పాడ మత్స్యకారులతో చర్చించిన తరవాత ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాలుష్య సమస్యలపై చర్యలకు ఉపక్రమించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో పవన్ కల్యాణ్ ఇవాళ శనివారం మిగతా2లో...



## వాట్సాప్ లేకుంటే ఏమి...?

**- 'అరట్టై' ఉపయోగించండి**

**- పిటిషనర్‌కు సుప్రీం సలహా**

**న్యూఢిల్లీ,అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** వాట్సప్‌కు పోటీగా తీసుకొచ్చిన స్వదేశీ మెసేజింగ్ యాప్ "అరట్టై' పేరు ఇటీవల నెట్టింట మార్మోగుతోంది. తాజాగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులోనూ దీని ప్రస్తావన మిగతా2లో...

## 42 శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

- బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసి బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే కుట్ర
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ విమర్శలు



**హైదరాబాద్,అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని మరోసారి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ల జీవోను, ఎన్నికల నోటిఫికేషన్ అమలుపై హైకోర్టు స్టే ఇచ్చినందున సుప్రీంకోర్టుకు వెళ్లి అప్పీలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అక్కడ వెసులు బాటు దొరుకుతదని ఆశిస్తున్నట్లు తెలిపారు. రిజర్వేషన్లు ఆపటంలో అసలైన ముద్దాయి బీజేపీ అని విమర్శించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ మిగతా2లో...

## జూబ్లీహిల్స్ కోసం బిఆర్ఎస్ వార్ రూమ్

**పార్టీ నేతలతో కెటిఆర్ టెలి కాన్ఫరెన్స్**



**హైదరాబాద్,అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై ప్రతిపక్ష బీఆర్‌ఎస్ సీరియస్‌గా దృష్టి సారించింది. ఇందులో భాగంగా శనివారం ఉప ఎన్నిక ఇంఛార్జ్‌లతో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ టెలీ కాన్ఫిరెన్స్ నిర్వహించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంపై ఇంచార్జ్‌లకు కేటీఆర్ దిశానిర్దేశర చేశారు. మరోవైపు బై ఎలక్షన్ కోసం వార్ రూం ఏర్పాటు చేస్తోంది బీఆర్‌ఎస్. వార్ నుంచే ఉప ఎన్నిక కార్యకలాపాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఉప ఎన్నిక ప్రచారం, సభలు, ర్యాలీలకు బీఆర్‌ఎస్ ఎ÷-లాన్‌ను సిద్ధం చేస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ మంత్రులు కేటీఆర్, మిగతా2లో...

## పదేళ్లలో కాలేశ్వరం కడితే.. మూడేళ్లకే కూలింది

- అయినా రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి
- కృష్ణాగోదావరి జలాల్లో రాజీపడేది లేదు
- ఆల్మట్టి ఎత్తును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించం
- హరీష్ రావు అబద్దాల ప్రచారంమానుకోవాలి
- మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్




## కాంగ్రెస్‌లో మరో ఇద్దరు మంత్రుల పంచాయితీ

- మేడారం కాంట్రాక్టుల విషయంలో రచ్చ
- వరంగల్‌లో వేలు పెడుతున్న పొంగులేటి
- మండిపడ్డ కొండా సురేఖ దంపతులు







## ఐపీఎస్ అధికారి సూసైడ్ కేసు..

**- రోహ్‌తక్ ఎస్పీపై బదిలీ వేటు**

# వికసిత్ భారత్‌లో రైతులది ముఖ్య భూమిక

(మొదటి పేజీ తరువాయి)

ఎలాంటి విజన్ లేదని విమర్శించారు. రైతుల ఆదాయం పెంచేందుకు, పంటల సాగు వ్యయం తగ్గించేందుకు గత పదేళ్లుగా ఎన్డీయే ప్రభుత్వం ఎరువులపై రూ.13లక్షల కోట్ల సబ్సిడీ ఇచ్చిందని ప్రధాని మోదీ అన్నారు. యూపీఏ పదేళ్లలో రూ.5 లక్షల కోట్లు మాత్రమే సబ్సిడీగా ఇచ్చిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు వ్యవసాయరంగానికి ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని వివరించారు. రైతులకు కేంద్రంలోని గత కాంగ్రెస్ ప్రభుత్వం చేసేందేమీ లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 2004 నుంచి 2014 వరకూ యూపీఏ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయరంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అయితే బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 11 ఏళ్లుగా రైతుల అభివృద్ధి, స్వయం సమృద్ధికి ఎన్నో చర్యలు తీసుకుందని వివరించారు. వ్యవసాయరంగానికి సంబంధించిన వివిధ శాఖలు ఇష్టారీతిలో వ్యవహరించడం వల్ల దేశంలోని వ్యవస్థాయ వ్యవస్థ బలహీనమవుతూ వచ్చిందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిలో మార్పులు చేస్తూ విత్తనాల దగ్గర నుంచి మార్కెట్ వరకూ రైతులకు ప్రయోజనాలు చేకూరే లెక్కలేనని సంస్కరణలు తెచ్చామని చెప్పారు. దేశ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు దాదాపు రెట్టింపయ్యాయని, ఆహారధాన్యాలు, పళ్లు, కాయగూరల ఉత్పత్తి సుమారు 90 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెరిగిందని, గతంలో ఇది 64 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉండేదని చెప్పారు. 2014 నుంచి తేనె ఉత్పత్తి రెట్టింపు అయిందని అన్నారు. అభివృద్ధి భారతాన్ని కోరుకుంటే ప్రతి రంగంలోనూ ఇండియా బలపడాల్సి ఉంటుందన్నారు. ఏవో కొన్ని సాధించినంత మాత్రాన తృప్తి పడిపోరాదని సూచించారు. వెనుకబడిన ప్రాంతాలపై దృష్టి పెట్టినప్పుడే గణనీయమైన ఫలితాలు ఉంటాయన్నారు. ఇవాళ యాస్పిరేషనల్ జిల్లాల్లో ప్రసూతి మరణాలు తగ్గాయని, చైల్డ్ హెల్త్ మెరుగైందని, విద్యాప్రమాణాలు పెరిగాయని చెప్పారు. దీంతో ఈ జిల్లాలు ఇతర జిల్లాల కంటే మెరుగైన రీతిలో దూసుకెళ్తున్నాయని, ఈ మోడల్ ఆధారంగా వ్యవసాయంలో వెనుకబడిన 100 జిల్లాలను అభివృద్ధి చేసేందుకు దృష్టి సారించామని, ఇందువల్ల అవి మరింత మెరుగైన జిల్లాలుగా మారనున్నాయని చెప్పారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే అన్ని రంగాల్లో నిరంతరం కొత్త మార్పులు చోటుచేసుకోవాలని ప్రధాని పేర్కొన్నారు. ఈ ఆలోచనలో భాగంగానే ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు దేశంలోని 100కు పైగా జిల్లాలను వెనకబడిన జిల్లాలుగా ప్రకటించి.. ఆపై వాటిని పూర్తిగా మరిచిపోయాయని ప్రధాని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ వెనకబడిన జిల్లాలపై ప్రత్యేక దృష్టిసారించి, వాటిని ఆశావహ జిల్లాలుగా ప్రకటించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాజెక్టులను అమలుచేస్తోందన్నారు. వీటన్నింటినీ ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన కిందకు తీసుకువస్తున్నట్లు తెలిపారు. వెనకబడిన జిల్లాలలోని అనేక ప్రాంతాల్లో గత పాలకులు రోడ్లు కూడా వేయించలేదని.. అటువంటి వాటిని తమ ప్రభుత్వం డిజిటల్ ఇండియా దిశగా నడిపిస్తోందన్నారు. గ్రామీణప్రాంత ప్రజలకు విద్య, వైద్యం, నివాసం, విద్యుత్, రోడ్డు వంటి అన్నిరకాల సదుపాయాలు కల్పించడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత పదకొండేళ్లలో రైతులు పలు విజయాలు సాధించారని.. పదివేలకు పైగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పడ్డాయన్నారు.

## 42 శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

(మొదటి పేజీ తరువాయి)

కలిసి బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. గవర్నర్ దగ్గర బిల్లుని పెండింగ్ లో ఉంచారని.. గవర్నర్‌ను నియమించేది ఎవరని ప్రశ్నించారు. మూడు చట్టాలు ఒక ఆర్డినెన్సు గవర్నర్ వద్ద పెండింగ్ లో ఉన్నాయని చెప్పారు. బీసీలకు నోటి దాకా వచ్చిన ఫలాలను అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉందన్న ఆయన.. మోదీ బీసీ ప్రధాని అని చెప్పుకునే బీజేపీ నేతలు, బీసీ రిజర్వేషన్ బిల్లుపై ఎందుకు ఒత్తిడి తీసుకురావటం లేదు? అని ప్రశ్నించారు. ఏపీ ప్రాజెక్టు బనకచర్ల విషయంలో చేయాల్సింది అంత చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ ఉదాసీనత వల్ల జీవో ఇచ్చారని దుయ్యబట్టారు.

## జూబ్లీహిల్స్ కోసం బిఆర్ఎస్ వార్ రూమ్

(మొదటి పేజీ తరువాయి)

హరీష్ రావు ర్యాలీలు నిర్వహించనున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో బీఆర్ఎస్ ముందుకు వెళ్తోంది. కాగా.. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్‌లో ఉపఎన్నిక అనివార్యమైంది.జూబ్లీహిల్స్‌లో మరోసారి గులాబీ పార్టీ జెండా ఎగువేయాలనే లక్ష్యంతో ఉంది బీఆర్ఎస్. అందులో భాగంగానే జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భార్య మాగంటి సునీత పేరును ప్రకటించింది ఆ పార్టీ. సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవడం బీఆర్ఎస్‌కు పెద్ద సవాల్ అనే చెప్పుకోవాలి. ఇప్పటికే ప్రచారాన్ని కూడా నిర్వహిస్తోంది. ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తోంది. సిట్టింగ్ స్థానాన్ని దక్కించుకోవాలనే పట్టుదలతో బీఆర్ఎస్ ఉంది.నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరుగనుంది. నవంబర్ 14న కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఈనెల (అక్టోబర్) 13న నోటిఫికేషన్ విడుదల కానుండగా.. అక్టోబర్ 21 నామినేషన్ దాఖలుకు చివరి తేదీ. అలాగే ఈనెల 22న నామినేషన్ల పరిశీలన జరుగనుంది.

## పదేళ్లలో కాళేశ్వరం కడితే..మూడేళ్లకే కూలింది

**హనుమకొండ,అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకు తాము పోరాడుతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్ట్‌పై కేంద్రానికి ఇప్పటికే లిఖిత పూర్వక ఫిర్యాదు చేశామని చెప్పారు. అలాగే ఆలమట్టి ఎత్తు పెంపునకు వ్యతిరేకంగా కూడా తాము ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో కట్టకుండా చూస్తామని మంత్రి ఉత్తమ్ ప్రకటించారు. అయితే నీటి పంపకాల పంచాయతీలో మంత్రి హోదాలో హాజరైన ఏకైక వ్యక్తిని తానేనని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తు చేశారు. మీరు నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ పనికి రాకుండా పోయిందంటూ హరీశ్ రావుకు చురకలంటించారు. ఈ 22 నెలల్లో కాళేశ్వరం ప్రాజక్ట్ నయాపైసా కూడా పనికి రాలేదన్నారు. మంత్రి సీతక్కతో కలిసి హనుమకొండలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగంగా ఉంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నుంచి చుక్కనీరు లిఫ్ట్ చేయకుండా మేం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మూడో పంటలో కూడా భారతదేశంలో అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించింది. ఈ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 108.5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పడుతోంది. దాంట్లో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేయబోతోంది. భారత దేశంలో ఇంత ధాన్యం ఇప్పటి వరకు ఏ రాష్ట్రం కొనుగోలు చేయలేదని మంత్రి వివరించారు. హరీశ్ రావు మంత్రిగా ఉన్న సమయంలో గోదావరి జలాలను ఆంధ్రకు అప్ప జెప్పారని గుర్తు చేశారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ వాటా నీటిని తాము కాపాడుకుంటామని తెలిపారు. తప్పుడు మాటల ద్వారా అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారంటూ హరీశ్ రావుపై మండిపడ్డారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బీఆర్ఎస్ కట్టిన ఏకైక కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ కూలిపోయిందని వ్యంగ్యంగా అన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ తుమ్మడిహెట్టి వద్ద త్తటెడు మట్టి ఎత్త లేదని విమర్శించారు. గోదావరి జలాల విషయంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే తెలంగాణకు మేలు జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. హరీశ్ రావు మాట్లాడిన మాటలలో వాస్తవాలు ఏమి లేవని.. ఈ తరహా ప్రచారాన్ని మానుకోవా లంటూ ఆయనకు ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దేశంలోనే అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డుల కెక్కిందని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. త్వరలో ధాన్యం కొనుగోళ్లు కూడా ప్రారంభమవుతాయన్నారు. అది కూడా మూడేళ్లకే కూలిందని మంత్రి ఉత్తమ్ అన్నారు.అవాస్తవాలు మాట్లాడుతూ.. తమ ప్రభుత్వాన్ని బద్నాం చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి. హరీశ్ రావుకు తెలంగాణ భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. అబద్దాలను ప్రచారం చేస్తూ ఆరోపణలు చేయడం సరికాదంటూ హరీశ్ రావుకు ఆయన హితవు పలికారు. బనకచర్లపై హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. అంతేకాదు.. బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణానికి పార్టీ వ్యతిరేకమని తాము మొదటి నుంచి చెబుతున్నామని గుర్తు చేశారు.

## 14న బిసి కులాల బంద్: కిషన్ రెడ్డి మద్దతు కోరిన కృష్ణయ్య

**హైదరాబాద్,అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీసీ రిజర్వేషన్లకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసనగా ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపునిస్తున్నట్లు బీసీ సంఘాల నాయకుడు ఆర్ కృష్ణయ్య ప్రకటించారు. అన్ని బీసీ సంఘాల మద్దతుతో బంద్ నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. అందరూ కలిసి బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. రాజకీయ పార్టీలు, కుల సంఘాలు బంద్‌కు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బంద్‌కు బీజేపీ మద్దతు ఇవ్వాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కోరడం జరిగిందని తెలిపారు. దీనిపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కిషన్ రెడ్డి చెప్పారని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చాక కోర్టులు జోక్యం చేసుకోవడం ఏంటని ప్రశ్నించారు. బీసీ సంఘాలు ఇప్పటికే పెద్ద ఎత్తున రౌండ్ టేబుల్ సమావేశం, నిరసనలు, ధర్నాలు చేస్తున్నారని ఎంపీ ఆర్.కృష్ణయ్య వెల్లడించారు.

## కాంగ్రెస్‌లో మరో ఇద్దరు మంత్రుల పంచాయితీ

**వరంగల్,అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్ మధ్య వివాదం మరువక ముందే.. కాంగ్రెస్ క్యాబినెట్ మంత్రుల మధ్య మరో లొల్లి మొదలైంది. మేడారం అభివృద్ధి టెండర్ల విషయంలో వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ఆ శాఖకు చెందిన మంత్రుల మధ్య విభేదాలు ముదిరి రచ్చకెక్కాయి. మంత్రి పొంగులేటిపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సీఎం రేవంత్ రెడ్డికి, పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. వరంగల్ రాజకీయాలతోపాటు దేవాదాయ శాఖలో మంత్రి పొంగులేటి జోక్యం చేసుకుంటున్నట్లు కొండా దంపతులు అందులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకి ఫోన్ చేసిన కొండా మురళి ఆయనకు ఫిర్యాదు చేశారు. పొంగులేటి తన సొంత కంపెనీకి పనులు ఇప్పించుకుంటున్నారని తెలిపారు. ఆయన వల్ల జిల్లాలో తాము ఇబ్బంది పడుతున్నామని వెల్లడించారు. అదేవిధంగా జిల్లా రాజకీయాలను ఖర్గేకి వివరించారు. పార్టీ పెద్దలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లారు. హైకమాండ్ నుంచి సానుకూల స్పందన వచ్చిందని కొండా దంపతులు పేర్కొన్నారు. కాగా, ఇటీవల మేడారంలో పర్యటించిన సీఎం రేవంత్ రేవంత్ రెడ్డి.. పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వరంగల్ జిల్లా రాజకీయాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జోక్యం చేసుకుంటున్నారంటూ కాంగ్రెస్ నేత కొండా మురళి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ జిల్లాలో పొంగులేటి పెత్తనం ఏంటని ఆయన ప్రశ్నించారు. దీనిపై ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖలో పొంగులేటి జోక్యంపై పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేకు ఫిర్యాదు చేశారు. మేడారం టెండర్ల వ్యవహారంపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పొంగులేటి సొంత కంపెనీకి పనులు ఇప్పించుకున్నారని అందులో ఆరోపించారు. ఈ వ్యవహారంలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీలతోపాటు మీనాక్షి నటరాజన్‌కు సైతం కొండా మురళి ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో హైకమాండ్ నుంచి సానుకూల స్పందన వచ్చినట్లు ఆయన తెలిపారు.

## తెలంగాణలో నాలుగు రోజుల పాటు వర్షాలు

● హైదరాబాద్

### వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్,అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర తమిళనాడు తీరప్రాంతం, పరిసర ప్రాంతాల్లో సగటు సముద్రమట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని పేర్కొంది. ఉత్తర కోస్తాంధ్ర, పరిసర ప్రాంతాల్లో సగటు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని.. దక్షిణ ఒడిశా నుంచి ఏపీ తీర ప్రాంతం మీదుగా ఉత్తర తమిళనాడు వరకు సగటు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతుందని చెప్పింది. శనివారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.ఆదివారం కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో.. సోమవారం కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగు లాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. మంగళవారం ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మ హబూబాబాద్, వరం గల్, హను మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

## నోబెల్ శాంతి బహుమతి ఇమ్మని అడగలేదు

(మొదటి పేజీ తరువాయి)

శాంతి బహుమతి దక్కకపోవడంపై ట్రంప్ తాజాగా స్పందించారు. ఈ మేరకు మరియా కొరీనా మచాడోతో ఫోన్‌లో సంభాషించినట్లు తెలిపారు. 'కొరీనా మచాడోతో ఫోన్‌లో మాట్లాడాను. నా గౌరవార్థం దాన్ని స్వీకరించినట్లు ఆమె నాతో చెప్పారు. అలా అని ఆ బహుమతి నాకు ఇచ్చేయమని నేను అడగలేదు. విపత్తు సమయంలో వెనెజువెలాలోని ప్రజలకు ఆమె చాలా సాయం చేశారు. నేను ఆమెకు తోడున్నా. ఇకముందు కూడా ఉంటా' అని వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి మరియా కొరీనా మచాడోను వరించిన విషయం తెలిసిందే. ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కోసం విశేషంగా కృషి చేసిన మచాడో వెనెజువెలా ఉక్కు మహిళగా కూడా పేరుపొందారు. టైమ్ మ్యాగజైన్ ప్రచురించిన ప్రపంచంలోని అత్యంత పలుకుబడిగల 100 మంది ప్రముఖుల జాబితాలో కూడా ఆమె చోటు దక్కించుకున్నారు. గత ఏడాది జరిగిన వెనెజువెలా పార్లమెంట్ ఎన్నికలలో భారీ స్థాయిలో రిగ్గింగ్ జరిగి ప్రస్తుత అధ్యక్షుడు నికొలస్ మదురో గెలుపొందిన తర్వాత 58 ఏళ్ల మచాడో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ శాంతి బహుమతి దక్కడంపై మరియా కొరీనా స్పందిస్తూ.. 'స్వేచ్ఛ కోసం, ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న వెనెజువెలా ప్రజలందరికీ ఈ గుర్తింపు గొప్ప ప్రేరణ ఇస్తుంది. లక్ష్యసాధనలో విజయానికి చేరువలో ఉన్నాం. ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాలు మాకు మిత్రులు. ఈ పురస్కారాన్ని కష్టాల్లో ఉన్న వెనెజువెలా ప్రజలతోపాటు మా పోరాటానికి నిర్మాణాత్మక మద్దతు ఇస్తున్న ట్రంప్‌నకు అంకితం ఇస్తున్నా' అని అన్నారు.

## ఉప్పాడ కాలుష్యంపై చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

సమీక్ష సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమీక్షలో కాకినాడ జిల్లా యంత్రాంగం పాల్గొంది. ఉప్పాడ తీర ప్రాంతంలో కాలుష్య నియంత్రణ అంశాలపై దిశానిర్దేశం చేశారు పవన్ కల్యాణ్. కాకినాడ జిల్లాలో ఉన్న పారిశ్రామిక కాలుష్యం, మైనింగ్ మూలంగా తలెత్తుతున్న కాలుష్య ఇబ్బందులపై చర్చించారు. కాకినాడలో చేపట్టిన మత్స్యకారులతో మాట.. మంతిలో మత్స్యకారులు ప్రస్తావించిన అంశాలు, వారి సందేహాలపై పీసీబీ నుంచి వివరాలు తీసుకున్నారు పవన్ కల్యాణ్. పొల్యూషన్ ఆడిట్‌కి అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించారు. కాకినాడ జిల్లాతోపాటు గోదావరి జిల్లాల్లో ఉన్న కాలుష్య పరిస్థితులు, పర్యావరణ పరిరక్షణపై వివరాలు అడిగి పవన్ కల్యాణ్ తెలుసుకున్నారు.

### వాట్సాప్ లేకుంటే ఏమి...?

(మొదటి పేజీ తరువాయి)

వచ్చింది. వాట్సప్ ఖాతా పునరుద్ధరణకు సంబంధించి దాఖలైన ఓ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. వాట్సప్ లేకపోతే ఏం.. అర్టై వాడొచ్చు కదా అని సూచించింది. తన ఖాతాను వాట్సప్ బ్లాక్ చేసిందని, దాన్ని పునరుద్ధరించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. సామాజిక మాధ్యమాలు ఇలా ఖాతాలను ఉన్నట్టుండి నిషేధించకుండా ఉండేలా మార్గదర్శకాలు జారీ చేయాలని పిటిషనర్ న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై సుప్రీం ధర్మాసనం ఒకింత అసహనం వ్యక్తంచేసింది. ఆర్టికల్ 32 కింద ఈ పిటిషన్ ఎందుకు వేశారని అడిగింది. వాట్సప్ యాక్సెస్ ఉండటం ప్రాథమిక హక్కు ఎలా అవుతుందని ప్రశ్నించింది. దీనికి పిటిషనర్ తరఫు న్యాయవాది బదులిస్తూ.. పిటిషనర్ ఓ పాలీ డయాగ్నిక్ సెంటర్‌లో పనిచేస్తున్నారు. గత 10-12 ఏళ్లుగా వాట్సప్‌లోనే తన క్లయింట్‌లతో టచ్‌లో ఉన్నారు. ఉన్నట్టుండి ఆ ఖాతాను బ్లాక్ చేశారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. అయితే ఏంటీ? కమ్యూనికేషన్ కోసం ఇతర యాప్‌లు కూడా ఉన్నాయి. వాటిని ఉపయోగించొచ్చు కదా..! ఈ మధ్యే స్వదేశీ యాప్ 'అర్టై' కూడా వచ్చింది. దాన్ని వాడుకోండి. మేక్ ఇన్ ఇండియా! అని సూచించింది. ఈ పిటిషన్ హైకోర్టులో కూడా విచారణకు అర్హమైంది కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీనిపై ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరిస్తూ పిటిషన్‌ను తిరస్కరించింది. కోర్టు అనుమతితో పిటిషనర్ తన వ్యాజ్యాన్ని ఉపసంహరించుకున్నారు.దేశీయ సంస్థ జోహో అభివృద్ధి చేసిన అర్టైకి విపరీతమైన ప్రజాదరణ లభిస్తోంది. ఇప్పటికే కోటి మందికి పైగా దీన్ని డౌన్‌లోడ్ చేసుకున్నారు. అర్టై అంటే తమిళంలో పిచ్చాపాటీ సంభాషణ అని అర్థం. ఈ యాప్ ద్వారా మెసేజ్‌లు, వాయిస్, వీడియో కాల్స్ చేసుకోవటానికి, మీటింగుల్లో పాల్గొనటానికి, స్టోరీలు, ఫొటోలు, డాక్యుమెంట్స్ షేర్ చేసుకోవచ్చు.

## ఐపీఎస్ అధికారి సూసైడ్ కేసు..

● రోహతక్ ఎస్పీపై బదిలీ వేటు

**చండీగఢ్,అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** హర్యానా అదనపు డీజీపీ వై పూరన్ కుమార్ ఆత్మహత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రోహతక్ ఎస్పీ నరేంద్ర బిజార్నియాని ప్రభుత్వం శనివారం బదిలీ చేసింది. ఆయన స్థానంలో సురేందర్ సింగ్ భోరియాను నియమించింది. పూరన్ కుమార్ ఆత్మహత్యపై విమర్శలతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.ఈ కేసు విచారణకు సిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు చండీగఢ్ పోలీస్ చీఫ్ సాగర్ ప్రీత్ హుడా ఇప్పటికే ప్రకటించారు. తన భర్త ఆత్మహత్యకు రాష్ట్ర డీజీపీ శత్రుజీత్ సింగ్ కపూర్, రోహతక్ ఎస్పీ నరేంద్ర బిజార్నియాలే కారణమని ఆరోపిస్తూ పూరన్ కుమార్ భార్య, ఐఏఎస్ అధికారి అన్మీత్ కుమార్ ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వం స్పందించాల్సి వచ్చింది. దీంతో వారిపై ఎఫ్ఐఆర్ నమోదైంది.

## హైకోర్టు స్టేతో సుప్రీంలో సవాల్

(మొదటి పేజీ తరువాయి)

సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కోసం సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయిచింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి , టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి తదితరులు జూమ్ మీటింగ్ లో మాట్లాడారు. హైకోర్టు స్థానిక సంస్థలు ఎన్నికల నోటిఫికేషన్, జీవో 9 మీద స్టే ఇవ్వడంపై తదుపరి చర్యల గురించి సుదీర్ఘంగా చర్చించారు. జీవో 9 ని అమలు చేసేందుకు సుప్రీం కోర్ట్ తలుపు తట్టాలని నిర్ణయానికి వచ్చారు.ఈ సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని సీఎం రేవంత్ అన్నారు. మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న లక్ష్యం గా మందుకెళ్తోంది. బీసీలకు రిజర్వేషన్లు విషయం తేల్చే వరకు స్థానిక ఎన్నికలకు వెళ్లబోమని ఇప్పటికే మంత్రులు చెప్పారు. మరో వైపు సుప్రీం తీర్పు ప్రకారం పాతపద్దతిలో అంటే.. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకుండా స్థానిక ఎన్నికలు నిర్వహించుకోవచ్చని హైకోర్టు తెలిపింది. జీవో 9 పై మాత్రమే స్టే ఇచ్చిందని..రిజర్వేషన్ల విషయంలో క్లారిటీ ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రభుత్వానికి లేఖ రాసింది. మరోవైపు వచ్చే వారంలో క్యాబినెట్ భేటీ జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. కాగా హైకోర్టు జీవో 9పై స్టే విధిస్తూ, 2 వారాల్లో పిటిషనర్లు కౌంటర్ దాఖలు చేయాలని, అలాగే 4 వారాల్లో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. తాజాగా బీసీ రిజర్వేషన్ల పై హైకోర్టు ఆర్డర్ కాపీ వెలువడింది. జీఓ 9, 41, 42 ల పై హైకోర్టు స్టే విధించింది. ట్రిపుల్ టెస్టు పాటించకపోవడం పై హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. సుప్రీం కోర్టు నిబంధనల ప్రకారం 50 శాతం రిజర్వేషన్లు మించి ఉండడాన్ని తప్పుబట్టింది. తదుపరి విచారణ డిసెంబర్ 3 కు వాయిదా వేసింది. వికాస్ కృష్ణా రావు గవాలి, రాహుల్ రమేష్ వాగ్ కేసుల్లో సుప్రీంకోర్టు తీర్పులను హైకోర్టు పరిగణలోకి తీసుకున్నది.

# బానిసత్వం వదిలేద్దాం రాజకీయ అధికారం చేపడదాం






● బహుజనులే తెలంగాణ పాలకులని నినదించిన నాయకులు ● జనరల్ సీట్లన్నిటిలో బి.సి లు పోటీ చేయాలి ● బహుజనుల ఓట్లు బహుజనులకే వేసుకుందాం ● ఐక్య ఉద్యమాలతోనే రిజర్వేషన్లు సాధ్యం ● రౌండ్ టేబుల్ సమావేశంలో బహుజన నాయకులు

**హనుమకొండ, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆధిపత్య కులాల రాజకీయ పార్టీలు బి.సి లకు ఇచ్చే రిజర్వేషన్లు అవసరం లేదని బహుజనుల ఓట్లు బహుజనులకు వేసుకుంటే జనరల్ సీట్లన్నిటిలో బి.సి లు పోటీ చేసి గెలువచ్చని బి.సి నాయకులు ఉద్ఘాటించారు. స్థానిక సంస్థల్లో బి.సి లకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుపై ఇటీవల తెలంగాణ హై కోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో బి.సి చైతన్య వేదిక, ఆల్ ఇండియా ఒబిసి జాక్ ఆధ్వర్యంలో బి.సి రిజర్వేషన్లు - ఉద్యమ కార్యాచరణ అనే అంశంపై హనుమకొండ జిల్లా కేంద్రం ప్రెస్ క్లబ్ లో శనివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు, విద్యార్థులు, న్యాయవాదులు మాట్లాడారు. బి.సి చైతన్య వేదిక ఛైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, వి.సి.కె పార్టీ డాక్టర్ జిలకర శ్రీనివాస్, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలస సుధీర్, బి.సి ఇంటలెక్టువల్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కూరపాటి వెంకటనారాయణ, తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి తదితరులు మాట్లాడారు. బి.సి రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమం లాగా విద్యార్థులు, ఉద్యోగస్తులు, న్యాయవాదులు, సబ్బండ వర్గాలవారు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఓట్లు వేసి అధికారం ఆధిపత్య కులాల వారికి ఇవ్వడమేంటి, హక్కులు, అధికారం కోసం వారిని అడుక్కోవడమేంటని, బహుజనుల ఓట్లు బహుజనులు వేసుకుంటే జనరల్ సీట్లలో సైతం బి.సి లే గెలవవచ్చని ఆ దిశగా బి.సి ఉద్యమ నాయకత్వం సిద్ధం కావాలని అన్నారు. బి.సి రిజర్వేషన్లకు ఎస్సీ, ఎస్టీ ల మద్దతు ఉంటుందని, రిజర్వేషన్లు సాధించే వరకు వారు వెన్నంటి ఉంటామని హామీ ఇచ్చారు. బి.సి కుల జనగణన జరిపి బి.సి లకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో రిజర్వేషన్ల కల్పన విషయంలో అన్ని పార్టీలు బి.సి లను మోసం చేస్తున్నారని, రాజకీయ పార్టీల మోసాలను గ్రామ గ్రామాన తిరిగి ప్రజలను చైతన్యం చేయాలని, రిజర్వేషన్ల సాధన కోసం పార్టీలకు అతీతంగా అన్ని సంఘాలతో కలిపి ఒక ఫ్రంట్ గా ఏర్పడి ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు తాడిశెట్టి క్రాంతికుమార్, చాపర్తి కుమార్ గాడ్గే, గొల్లపల్లి వీరస్వామి, బక్కి యాదగిరి, సోమిడి అంజన్ రావు, వేణుమాధవ్, ధర్మపురి రామారావు, తిరుపతి, నూర సంపత్ పటేల్, జంగిలి శ్రీనివాస్, పెండెల సంపత్ పటేల్, శ్రీధర్ రాజు, నలిగింటి చంద్రమౌళి, సాయిబాబ, కేడల ప్రసాద్, మధుపాక ఎల్లన్న, సూత్రపు అనిల్, రావులకారు వెంకటేష్, ఐతం నగేష్, పెరమాండ్ల వెంకటేశ్వర్లు, న్యాయవాదులు చిల్ల రాజేంద్రప్రసాద్, రాచకొండ ప్రవీణ్ కుమార్, కందగట్ల సుధాకర్, అల్లం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# 42శాతం బీసీ రిజర్వేషన్ల కోసం 16మంది తెలంగాణ ఎంపీలు రాజీనామా చెయ్యాలి

● మల్లంపల్లి మండల యూత్ ప్రెసిడెంట్ మొర్రిరాజుయాదవ్




**మల్లంపల్లి మండల ప్రతినిధి, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈరోజు బీసీల ఆత్మగౌరవంతో చెలగాటమాడుతుంది కాంగ్రెస్ బిజెపి పార్టీలు ఒకరురాష్ట్రంలో అధికారంలో ఉంటే ఇంకొకరు కేంద్రంలో అధికారంలో ఉన్నారు. ఈరోజు కాంగ్రెస్ పార్టీ బిజెపి పార్టీని అడగాల్సిందిపోయి ప్రతిపక్ష పార్టీగా ఉన్న బిఆర్ఎస్ పార్టీని అనడం చాలా హేయమైన చర్య. ఈరోజు కాంగ్రెస్ పార్టీకి బిజెపి పార్టీలకు బీసీలపైచికిత్స శుద్ధి ఉంటే కేంద్రంపై తెలంగాణ బిజెపి ఎంపీలుఒత్తిడి తీసుకొచ్చి 9 షెడ్యూల్లో చేర్చి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కలిపించడంకోసం కోసం 16 మంది ఎంపీలు రాజీనామా చేయాలి .కేంద్రంలో 8 కాంగ్రెస్ పార్టీ ఎంపీలు 8 బిజెపి పార్టీ ఎంపీ కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావలసింది పోయి ఒకరిని ఒకరు దూషించుకుంటూ బీసీలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. అసంపూర్ణమైన జీవోలు తీసుకువచ్చి బీసీలను అయోమయం చేసే ప్రయత్నం చేస్తున్నారు. బిఆర్ఎస్ పార్టీగా మా నాయకులు అసెంబ్లీలో బీసీ బిల్లుకు మద్దతు తెలిపిన విషయాన్ని కాంగ్రెస్ పార్టీ ఎట్లా విస్మరించి మా పార్టీ పై ఏలా నిందలు వేస్తుందో చెప్పాలి.అసెంబ్లీ లో బీసీ బిల్లు ప్రవేశపెట్టిన రోజునే మా నాయకులు అసమగ్రంగా జీవోలు తీసుకువచ్చి బీసీలను మోసపూర్చే చర్యలు చేయవద్దని బీసీల రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే 9వ షెడ్యూల్లో చేర్చేలా కృషి చేసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.లేకుంటే ఈ అసమగ్రమైన బిల్లు కోర్టుల్లో నిలపడదని మా నాయకులు అసెంబ్లీ సాక్షిగా ఆనాడే చెప్పారని అన్నారు. బీజేపీ పార్టీకి 08 ఎంపీ సీట్లు ఇస్తే ఇవ్వాలా కాంగ్రెస్ పార్టీ నాయకులు బిజెపి నాయకులను అడగాల్సింది పోయి బిఆర్ఎస్ పార్టీని మధ్యలోకి లాగి మా పార్టీ వల్లనే రిజర్వేషన్ల బిల్లు ఆగిందని అనడం అంటే ఆడలేక పందిరి కురుస అన్నట్టుగా ఉంటుంది అన్నారు. ఈ రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్,బీజేపీ ఎంపీలు బీసీ బిల్లును 9వ షెడ్యూల్లో చేర్చకపోతే మూకుమ్మడిగా రాజీనామాలకు సిద్ధపడాలి.అప్పుడే వారికి బీసీలకు రిజర్వేషన్ల పట్ల చిత్తశుద్ధి ఉందని తెలంగాణ ప్రజలు నమ్ముతారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర బూచిగా చూపెట్టి ఇతర రాష్ట్రాల్లో పబ్బం గడపడం కోసం బీసీల ఆత్మగౌరవంతో చెలగాటం ఆడుకుంటున్నారు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు సాధించడానికి బిఆర్ఎస్ పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ఉంటుంది.బీసీలను మోసం చేయాలని చూస్తేసహించేది లేదు. బీసీ రిజర్వేషన్ల కోసం ఎక్కడిదాకనైనా పోరాడుతామనిఈసందరంగా మొర్రి రాజు యాదవ్ అన్నారు.

# ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ

గాంధీ భవన్‌లో సమావేశం

ఏఐసీసీ అబ్జర్వర్ శక్తిసింగ్ గోయల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం

సీనియర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాల్గొన్నారు



**తొర్రూరు ప్రతినిధి,అక్టోబర్ 11(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న సంఘటన్ సృజన్ అభియాన్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ శనివారం గాంధీ భవన్‌లో నిర్వహించబడింది.ఈ సమావేశానికి ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి అధ్యక్షత వహించగా, ఏఐసీసీ అబ్జర్వర్ శక్తిసింగ్ గోయల్ , పీసీసీ అబ్జర్వర్ మరియు ఎంపీ మల్లు రవి , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హన్మంతరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జిల్లా పీసీసీ అబ్జర్వర్‌గా వ్యవహరిస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం, ప్రజలలోంచి వచ్చిన నాయకత్వాన్ని ప్రజల ద్వారానే ఎంపిక చేయడం వంటి అంశాలపై విస్తృత చర్చ జరిగింది.ఏఐసీసీ అబ్సర్వర్ శక్తిసింగ్ గోయల్ ప్రసంగిస్తూ కాంగ్రెస్ పార్టీ యొక్క ముఖ్య ఉద్దేశ్యం ప్రజల నుండి వచ్చిన నాయకత్వాన్ని ప్రజల ద్వారానే ఎంపిక చేయడం. ఈ స్ఫూర్తితో ఏఐసీసీ అబ్జర్వర్లు తెలంగాణలోని ప్రతి జిల్లాలో స్థానిక నాయకులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరిస్తున్నారు, అని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి ఆసక్తి గల ఎవరైనా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి నాయకుడితో వ్యక్తిగతంగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకుంటాం. ఆ సమాచారాన్ని టీపీసీసీ మరియు ఏఐసీసీకి పంపిస్తాం. ఈ విధానం ద్వారా పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరచాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం కొనసాగుతోంది, అని చెప్పారు.ఈ సందర్భంగా పీసీసీ అబ్బర్వర్ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రసంగిస్తూ.ఈ కార్యక్రమం పార్టీకి కొత్త ఉత్సాహం తెస్తుంది. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తుంది. ప్రజలే నాయకులను నిర్ణయించాలి అన్న స్ఫూర్తితో పార్టీ ముందుకు సాగుతుంది, అని పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, యువజన నాయకులు, మహిళా నాయకులు మరియు ఇతర కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# పరకాల పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలి

● ఉచిత ఎముకల సాంద్రత (బిఎండి) పరీక్ష శిబిరం

**పరకాల,అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణంలోని హుజురాబాద్ రోడ్‌లో గల హిమ పాలి క్లినిక్ లో ఆదివారం రోజున ఎముకల సాంద్రత (బిఎండి) పరీక్ష, యూరిక్ ఆసిడ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు హిమ పాలి క్లినిక్ నిర్వాహకులు సూర విష్ణు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12.10.2025 ఆదివారం రోజున డాక్టర్ బండ నవీన్ కుమార్ ఆర్థో ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత ఓపీ మరియు 2500 రూపాయల విలువగల ఎముకల సాంద్రత (బిఎండి) మరియు యూరిక్ యాసిడ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామని కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 970 4053212 అనే నెంబర్ ను సంప్రదించాలని కోరారు.

# అంతిమయాత్ర పాల్గొన్న సోదరామకృష్ణ



**పరకాల,అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రేగూరీ విజయపాల్ రెడ్డి తల్లి కీ,,శే,, రంగమ్మ అనారోగ్యంతో మరణించగా వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి అంతిమయాత్రలో పాల్గొన్న పరకాల పట్టణ కాంగ్రెస్ సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ, మాజీ కౌన్సిలర్స్ పంచగిరి జయమ్మ,నల్లెల్ల అనిల్ కుమార్, ఏకు రాజు, అడప రాము పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ బాలిక దినోత్సవం





**చిట్యాల అక్టోబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలో కస్తూరిబా హాస్టల్ లోని పిల్లలకు అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా హాజరై బాలికలు అన్ని రంగాలలో విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత స్కిల్ డెవలప్మెంట్, వంట పని ,ఆటలు, క్రీడలు అన్నింటిలో పాల్గొంటూ సమతుల హారం భుజించి మొబైల్ కు దూరంగా ఉంటూ బయట వారి మోసపూరిత మాటలు నమ్మవద్దని టీచర్స్ తల్లిదండ్రులు చెప్పిన మాటలు విని నేటి బాలలే రేపటి పౌరులుగా ఎదగాలని వివరించి ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. అలాగే ప్లాస్టిక్ ని తగ్గించండి కాటన్ బ్యాగులు ఇత్తడి స్టీలు రాగి బాటిల్స్ వాడడం మరియు కేంద్రాల్లో ఇండ్లలో కిచెన్ గార్డెన్ పెరటి తోటలు పెంచుకోవడం పరిసరాలు వ్యక్తిగత శుభ్రత త్రాగే నీరు శుభ్రము గా పెట్టుకోవడము సేంద్రీయ ఎరువులు వాడి కూరగాయల పళ్ళను ఆకుకూరలను పండించి పంటలో ఉపయోగించినట్లయితే అన్ని రకాల వ్యాధులను అరికట్ట వచ్చని అన్నారు ఈ కార్యక్రమంలో సంధ్యారాణి ,భాగ్యలక్ష్మి ,ఉమా ,సుజాత ,భాగ్యమ్మ అరుణ, జ్యోతి, ఆశ వర్కర్ విజయ మహిళలు కస్తూరిబా ఇన్ చార్జి మేడం రజిత ,ఉపాధ్యాయ బృందం కిశోర బాలికలు హాజరైనారు.

# మా చెరువును కాపాడాలని గ్రామస్తుల ఆందోళన









**హనుమకొండ, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం దేవన్నపేట గ్రామ శివారు లోని తూర్పు చెరువును కొంత మంది వ్యక్తులు జేసీబీ తో చదును చేశారు మత్తడి తీసేసి మత్తడి రాళ్ళను మొత్తం వేరే దిక్కుకు తరలించారు ఇలా చేయడం వల్ల చెరువులో చాలా నీరు బయటకు వృథాగా పోయి నీటిమట్టం తగ్గిపోయింది చెరువు ఖాళీ అయిన తరువాత కొంతభూమిని అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారు దీనిని అడ్డుకోవడానికి అన్ని పార్టీల నుండి నాయకులు వెళ్ళి చెరువును పరిశీలించగా కబ్జాకి గురైందని గుర్తించి మత్తడి తీసిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకొని శిక్షించాలని చెరువు మత్తడిని పునర్నిర్మించాలని కోరారు. అదే విధంగా చెరువుకు విస్తీర్ణం తెలిపే హద్దురాళ్లను ఎర్పాటు చేసి కబ్జాకోరల నుండి చెరువును కాపాడాలని గ్రామస్థులందరూ తెలిపారు. ఇట్టి చెరువుకు కాంగ్రెస్ ప్రభుత్వంలో సుమారు 8 లక్షలు మరియు బీ ఆర్ ఎస్ ప్రభుత్వం లో మిషన్ కాకతీయ పథకం కింద సుమారు 14 లక్షలు వెచ్చించి అబివృద్ధి చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. దీనిపై స్థానిక అధికారులు విచారణ చేపట్టాలని కోరారు.

## శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానంలో మొదలైన మొక్కు బడులు



**కరీంనగర్,అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానము ఆలయ విస్తరణ మరియు అభివృద్ధి పనులు చేపట్టుచునందున భక్తుల సౌకర్యార్థం, మొక్కు బడులు, ఆర్జిత సేవలకొరకై, అనగా కోడె మొక్కుబడి, అభిషేకములు, అన్నపూజ, కుంకుమపూజ, నిత్య కళ్యాణము, చండి హెరీమం, మొదలగు మొక్కు బడులు తీర్చుకొనుటకు శనివారం రోజు నుండి శ్రీ భీమేశ్వర స్వామి ఆలయము, వేములవాడలో అన్ని ఏర్పాట్లు చేయునైనది.అలాగే శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆలయములో (ప్రాధాన ఆలయములో) నిత్య కైంకర్యములు, ఛత్తుకాల పూజలు, ఆలయ అర్చకులచే యధావిధిగా అంతరంగితముగా నిర్వహింపబడును. ఈ ఏర్పాట్లను భక్తులు గమనించి సహకరించగలరని కోరనైనది.

## ఏసీబీకి చిక్కిన గ్రామ పంచాయతీ కార్యదర్శి



**గంగాధర అక్టోబర్ 10(పీసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంగంగాధర మండలం లోని మధురా నగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్ పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు దాడులు నిర్వహించారు. ఒక వ్యక్తి దగ్గర మధురానగర్ గ్రామ పంచాయతీ సంబంధిత ఇందిరమ్మ ఇంటి బిల్లు కోసం డబ్బులు రూ.10,000 డిమాండ్ చేసినట్లు సమాచారం. బాధితుడు ఈ విషయాన్ని ఏసీబీ అధికారులకు తెలియజేయగా, వారు ముందస్తు ప్రణాళికతో ట్రాప్ ఏర్పాటు చేసి కార్యదర్శిని లంచం స్వీకరిస్తున్న సమయ ంలో పట్టుకు న్నారు. అధికారిని అదుపులోకి తీసుకుని ఏసీబీ అధికారులు పంచాయతీ కార్యాలయం, శోధనలు నిర్వహిస్తున్నారు. లంచం తీసుకున్న మొత్తం, సంబంధిత పత్రాలు, రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సమాచార హక్కు చట్టం ప్రతి పౌరుడికి ఒక ఆయుధం లాంటిది



**చిట్యాల అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలో ఉన్న ఆదర్శ పాఠశాల కళాశాలలో ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వాసాల వెంకటేశ్వర్లు సమక్షంలో కళాశాల ప్రిన్సిపాల్ మేకల రమేష్.ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు సమాచార హక్కు చట్టం అనే అంశం పైన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా వాసాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రతి భారతీయుడు యొక్క ఆయుధమని దాని ద్వారా అనేక రకాలైనటువంటి విషయాలు తెలుసుకోవచ్చు అని ప్రజలకు తెలియజేయ వచ్చని ప్రజాస్వామ్య వ్యవస్థలో పనిచేసేటటువంటి వివిధ రకాలైనటువంటి సంస్థలు ఎమ్మార్వో ఎంపీడీవో ఎంఈఓ కలెక్టర్ డీఈఓ మొదలైనటువంటి సంస్థలలో పని చేసే కార్మికుల వ్యక్తిగత విషయాలు తెలుసుకోవచ్చు ఆ సంస్థలలో ఎలాంటి అభివృద్ధి పనులు చేశారు ఏ రకంగా చేశారు ఎంత నిధులు ఖర్చు చేశారు అనే విషయాలన్నీ తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని అన్నారు ఈ సమాచార హక్కు చట్టం ద్వారా అవినీతి అనేది లేకుండా అవినీతికి తావు లేకుండా అధికారులు పనిచేస్తారని ఏమైనా తప్పుడు పనులు చేస్తే ఈ చట్టం కింద అనేక రకమైనటువంటి కేసులు పెట్టవచ్చుఅని విద్యార్థిని విద్యార్థులకు సూచించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# రోడ్డుకు మరమ్మత్తులు చేయించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

● తారు రోడ్డు నిర్మాణానికి హామీ ఇచ్చిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**గంగాధర, అక్టోబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంగంగాధర మండలం బూరుగుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బొమ్మకంటిపల్లి కి వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైంది. గుంతల మయంగా మారిన రోడ్డుపై గ్రామానికి వెళ్లడానికి గ్రామస్తులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. కోతకు గురైన రోడ్డుకు మరమ్మత్తులు చేయించి ఇబ్బందులు తొలగించాలని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రోడ్డు మరమ్మత్తుకు నిధులు మంజూరు చేశారు. దీంతో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు రోడ్డుపై మట్టిని పోసి మరమ్మత్తులు చేయించారు. అలాగే బూరుగుపల్లి నుండి బొమ్మకంటిపల్లి వరకు తారు రోడ్డు వేయించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గారు ఇచ్చారు. సమస్యను వివరించగానే స్పందించి నిధులు మంజూరు చేసి రోడ్డుకు మరమ్మత్తులు చేయించడంతో పాటు తారు రోడ్డు నిర్మాణానికి హామీ ఇచ్చిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ దూలం శ్రీనివాస్, దూలం వీరేశం, సాగి అజయ్ రావు, సాగి నర్సింగారావు, అంజయ్య, దూలం ఆంజనేయులు, బైరిశెట్టి సంపత్, గడ్డం జానీ, దూలం తిరు పతి, బత్తిని శ్రీనివాస్, బైరిశెట్టి ప్రవీణ్, బొమ్మ కంటి నవీన్, అత్తపురం ప్రశాంత్ గ్రామస్తులు ఉన్నారు.

## కపిల్ కుటీర్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ బాలిక దినోత్సవం...






**కరీంనగర్,అక్టోబర్11పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ సంక్షేమ ట్రస్ట్ కపిల్ కుటీర్ శిశు సంరక్షణ కేంద్రంలో శనివారం రోజున అంతర్జాతీయ బాలిక దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శిశు సంరక్షణ కేంద్రాల్లో గల బాలికలతో ఆటలు ఆడించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య తిథులుగా హాజరైన జిల్లా సంక్షేమ అధికారి మార్త సరస్వతి, సి డబ్ల్యూ సి చైర్ పర్సన్ శ్రీరామోజు ధనలక్ష్మి ,డిసిపిఓ పర్వీన్ , సంరక్షణ కేంద్రం ఉపాధ్యక్షుడు వకులా– రాజారెడ్డి లు మాట్లాడుతూ బాలికలు భవిష్యత్తు శక్తి రూపాలన్నారు. బాలికలు లేకుంటే భవిష్యత్తు లేదని, బాలికల సంరక్షణతో భారతదేశం వెలుగుందుతుందని తెలిపారు. బాలికలకు విద్యా ప్రాముఖ్యత ఎంతో ముఖ్యమని, ఆ దిశగా విద్యలో బాలికలు రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డి సి పి యు, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బందిపూదరి, శాంత చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్, సాదినేని రమేష్, నాయిని స్వప్న సుందరగిరి సాయి కిరణ్ గౌడ్, కడే మహేష్,ఎడ్ల ప్రియాంక సంరక్షణ సిబ్బంది శ్రీనివాస్ , కృష్ణవేణి, బాల సదన్ సూపరిండెంట్ సంతోషిని,కీర్తి సరస్వతి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా మహిళా కాంగ్రెస్ సమీక్ష సమావేశం







**కరీంనగర్,అక్టోబర్11(పీసీడబ్ల్యూ న్యూస్):**ఈ రోజు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న రెడ్డి ఆధ్వర్యంలో మహిళా కాంగ్రెస్ సమీక్ష సమావేశం జరిగింది ఈ సమావేశంలో సత్యప్రసన్న మాట్లాడుతూ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీత రావు అదేశానుప్రకారం దేశ వ్యాప్తంగా ఓటు చోరీ హస్తాక్షర సేకరణ కార్యక్రమం గ్రామాలలో మరియు పట్టణాలలో చేపట్టాలని కోరడం జరిగింది.అదేవిధంగా మహిళా కాంగ్రెస్ను బలోపేతం చేయాలని కోరుతూ రాబోవు స్థానిక ఎలక్షన్ లో కష్టపడ్డ కాంగ్రెస్ పార్టీ మహిళలకు సముసిత స్థానం కల్పించడానికి సహాయం చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది.అనంతరం సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ ను వాడకూడదని పేపర్ గ్లాస్ బదులుగా గాజు గ్లాస్ లు కాని స్టీల్ గ్లాసులు వాడాలని చెప్పారు.కొన్ని గాజు గ్లాసులు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నకు అందజేయడం జరిగినది. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నగర అధ్యక్షురాలు వెన్నం రజిత,బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షులు పద్మ,సుశీల,జిల్లా వైస్ ప్రెసిడెంట్లు హసీనా ,స్వరూప కరీంనగర్ జిల్లా మహిళా మండల పట్టణ అధ్యక్షులు పుష్పలత,పద్మ,స్వప్న,రాజేశ్వరి,రాధ,రజిత,మల్లిక తదితరులు పాల్గొన్నారు.

# బిజెపితోనే గ్రామాల అభివృద్ధి...

● కన్నాపూర్‌లో బోరు,బావి ప్రారంభించిన

బిజెపి మండల అధ్యక్షులు ఎనుగుల అనిల్







**శంకరపట్నం,అక్టోబర్11(పీసీడబ్ల్యూ న్యూస్):**గ్రామాల అభివృద్ధి బిజెపి తోనే సాధ్యమని, కేంద్ర ప్రభుత్వం నిధులతోనే గ్రామాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయబడుతున్నాయని బిజెపి మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ అన్నారు. శనివారం శంకరపట్నం మండలంలోని కన్నాపూర్ గ్రామంలో ఇటీవల కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చొరవతో తన ఎంపీ నిధుల నుండి వేసిన బోరుబావుల ప్రారంభం సందర్భంగా ఎనుగుల అనిల్ మాట్లాడుతూ కన్నాపూర్ గ్రామస్తులు కోరగానే స్పందించిన కేంద్రమంత్రి బోరుబావిని వేయించడం జరిగిందనిపేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామా ప్రజలు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కి, బిజెపి మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ కు కృతజ్ఞతలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రెడ్డి నరేందర్.నాయకులు కొయ్యడ అశోక్, మందడి జగ్గారెడ్డి, దాసరి సంపత్, ఎల్కపెల్లి సంపత్, జానపట్ల రాజిరెడ్డి . వీరార్జున్. దాసరి సంపత్.జాలి రమణారెడ్డి నాంపెల్లి రవి, రాజిరెడ్డి.మాజీ ఉపసర్పంచ్ మల్లేశం. ముదిరాజ్ సంఘం నాయకులు నూనె పోశయ్య. భూమయ్య . సత్యనారాయణ.లతోపాటు బిజెపి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పదేళ్లు ప్రజలకు డోఖా చేసి బాకీ కార్డులు పంచుతారా...

● సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఫైర్.

● 10 సంవత్సరాల బీఆర్ఎస్ డోఖా పాలన,2 సంవత్సరాల కాంగ్రెస్ ప్రజా పాలన పై సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కార్డుల పంపిణీ.





**కరీంనగర్,అక్టోబర్11(పీసీడబ్ల్యూ న్యూస్):** 60 ఏళ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను సోనియా గాంధీ నెరవేర్చుతే పదేళ్లలో తెలంగాణ ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసి అప్పుల పాలు చేసింది చాలక ప్రజా పాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై బాకీ కార్డులు పంచుతారా అని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులపై మండిపడ్డారు.10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకిచ్చిన ఏఏ హామీలు నెరవేర్చలేదో అవన్నీ కార్డులో పొందు పరిచారు.2 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను ఇంకొక వైపు పొందు పరచి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు పదేళ్లు తెలంగాణ ప్రజలను డోఖా చేసినందుకు రాష్ట్రాన్ని అప్పులపాలు చేసినందుకు ప్రజలకు ముందు క్షమాపణ చెప్పాలని డోఖా చేసింది చాలక అనేక సంక్షేమ పథకాలతో ప్రజా పాలన అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ పై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలన్నారు.ప్రజలు బీఆర్ఎస్ నాయకుల నాటకాలను గమనిస్తున్నారని బీఆర్ఎస్ నాయకుల నాయకుల వైఖరి మార్చుకోకుంటే ప్రజలే తరిమికొడతారని నరేందర్ రెడ్డి హెచ్చరించారు.నగరంలోని అన్ని డివిజన్లలో కార్డులు పంపిణీ చేస్తామని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొరివి అరుణ్ కుమార్,కుర్ర పోచయ్య, యనమల మంజుల,ఆమెర్,దండి రవీందర్,తంగెళ్ల కిరణ్,అస్తాపురం రమేష్,నెల్లి నరేష్,మేరాజ్, షబానా మహమ్మద్,ముల్కల కవిత,అస్తపురం తిరుమల,జూపాక సుదర్శన్,కీర్తి కుమార్,కొట్టే ప్రభాకర్,మహమ్మద్ భారీ,బషీర్,ఖలీల్, తోట అంజయ్య,నదీమ్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్‌కి ఎంపికైన సునీల్



**చిట్యాల అక్టోబర్ (పిసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం జూకల్ గ్రామానికి చెందిన మ్యాదరి సునీల్ కవి ,డైరెక్టర్, నటుడు, నిర్మాత గా మూడు నిమిషాల నిడివిలో తెలంగాణ సాంస్కృతి , సాంప్రదాయాలు మీద ఓ లఘు చిత్రం రూపొందించారు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన "యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ "కార్యక్రమంలో ఈ షార్ట్ ఫిలిం ఎంపికవడంతో పలువురు కళాభిమానులు సునీల్ కు శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఎంపికైన షార్ట్ ఫిలింకు దిల్ రాజు అభినందనలు తెలిపారుఈ అవార్డ్ త్వరలో సినీ రాజకీయ ప్రముఖుల చేతుల మీదుగా తీసుకోవడం జరుగుతుందని మ్యాదరి సునీల్ తెలిపారు

## అంగన్వాడిని సందర్శించిన బిజెపి నాయకులు రుద్రగాని

**- చిన్నారులకు అందే పౌష్టికాహారం పై ఆరా...**



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం నగరం, 57 డివిజన్లోని 116 పోలింగ్ బూత్ లో ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని భారతీయ జనతా పార్టీ టూ టౌన్ ప్రధాన కార్యదర్శి రుద్రగాని మాధవరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రుద్రగాని మాధవ్ మాట్లాడుతూ... అంగన్వాడీ కేంద్రంలో సీజనల్ వ్యాధుల పట్ల చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలని, అంగన్వాడీ కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పౌష్టికాహారం గుడ్డు, బాలామృతం సక్రమంగా ఇస్తున్నారా లేదాని పరిశీలించారు. పిల్లలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి టీచర్ రజిని మాట్లాడుతూ.. ప్రభుత్వం నుండి పిల్లలకు రావలసిన అన్ని సదుపాయాలు సక్రమంగా, సకాలంలో అందుతున్నాయని, ఎప్పటికప్పుడు వాటిని పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు అందజేయడం జరుగుతుందన్నారు. అన్ని వివరాలను రికార్డులలో పొందుపరచడం జరుగుతుందన్నారు. పిల్లలకు పలకలను తనవంతు సహాయంగా అందిస్తానని రుద్రగాని మాధవ్, అంగన్వాడీ టీచర్ రజనీకి, పిల్లలకు హామీ ఇచ్చారు.

## తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయని కాంగ్రెసు ప్రభుత్వం

**యాదాద్రి అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయని కాంగ్రెస్ ప్రభుత్వం?మా ప్రభుత్వాన్ని గెలిపిస్తే చట్ట సభలో అవకాశం ఇస్తామన్నారు మరియు నామమినేటడ్ పోస్టులు కల్పిస్తామన్నారు.ఏదీ నేరవేర్చలెదు. అందువలన రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నాం.ఉద్యమకారులకు ఎలాంటి అవకాశం ఇవ్వలెదన్నారు.మాట మార్చిన రేవంత్ రెడ్డిని కలవడానికి వెళ్తే అపాయిట్మెంట్ దోరకని పరిస్తితి. వాట్సప్ ద్వారా సమాచారం పంపడం జరిగింది అయినను స్పదించని ముఖ్యమంత్రి అని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దామరోజు వీరాచారి అన్నారు.



# పేదల పక్షపాతి ప్రజా ప్రభుత్వం

**• రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి • తిరుమలాయపాలెం మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి**



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పేదల పక్షపాతి, పేదవాడికి అండగా, పేదవాడి కోసం పనిచేసే ప్రభుత్వమే మన ఇందిరమ్మ ప్రభుత్వమని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.శనివారం ఖమ్మం జిల్లా, తిరుమలాయపాలెం మండలంలో పర్యటించి మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. పాతర్లపాడు గ్రామంలో పాతర్లపాడు నుండి లకావత్ తండా వరకు రూ. 1.32 కోట్ల అంచనా వ్యయంతో బీటీ రోడ్డు, జోగులపాడు గ్రామంలో జోగులపాడు నుండి తిలావత్ తండా వరకు రూ. 90 లక్షల అంచనా వ్యయంతో బీటీ రోడ్డు, రూ.10 లక్షల అంచనా వ్యయంతో అంతర్గత సీసీ రోడ్లు, జల్లెపల్లి గ్రామంలో రూ. 30 లక్షల అంచనా వ్యయంతో అంతర్గత సిసి రోడ్లు, హైదర్ సాయిపేట గ్రామంలో రూ. 10 లక్షల అంచనా వ్యయంతో అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడే నాటికి ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలులో వెనక్కి తగ్గడం లేదని అన్నారు. ఆర్థిక పరిస్థితిని బాగు చేస్తూ 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. 25 లక్షల మంది రైతులకు 2 లక్షల వరకు రుణమాఫీ క్రింద 21 వేల కోట్లు ప్రభుత్వం ఏర్పడ్డ 9 నెలల్లోనే అందించామన్నారు. రైతు భరోసా సహాయం 12 వేలకు పెంచినట్లు, పోయిన నెలలో ఒకేసారి 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం సరఫరా, 11 లక్షల నూతన రేషన్ కార్డుల జారీ, పాత రేషన్ కార్డులలో 17 లక్షల కొత్త పేర్లు నమోదు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు.సన్న వడ్లు పండించిన రైతులకు మద్దతు ధరతో పాటు క్వింటాకు 500 రూపాయల బోనస్ మొదటి విడత అందించామని, రెండో విడత అందించనున్నట్లు అన్నారు. గత ప్రభుత్వం పేదలకు సొంతిల్లు అందించే పథకం నిర్లక్ష్యం చేసిందని, ప్రజా ప్రభుత్వంలో 22 వేల 500 కోట్లతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసామని అన్నారు. పాలేరు నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామన్నారు. రాబోయే 3 సంవత్సరాలలో మూడు విడతల్లో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని అన్నారు. ప్రతి సోమవారం ఇళ్ళు కట్టుకున్న స్టేజిని బట్టి డబ్బులు లబ్దిదారుని ఖాతాలో జమ చేస్తున్నామన్నారు. అన్నారు. విద్య, వైద్యానికి ప్రజాప్రభుత్వం పెద్ద పీట వేసిందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఇ యాకోబు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, పీఆర్ ఇఇ మహేష్ బాబు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 10 రోజుల పాటు నగరంలో పారిశుద్ధ్య పనులు



**- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**- నగర వ్యాప్తంగా రోడ్లు, డ్రైయిన్ పూడికతీత పనులు పూర్తి చేయాలి**

**- ప్రధాన రహదారుల మరమ్మత్తులు చేపట్టాలి**

**- ఖమ్మం నగరంలో కాలినడకన తిరుగుతూ, పారిశుద్ధ్య నిర్వహణ, మట్టి తొలగించే యంత్రాల పనితీరును పరిశీలించిన జిల్లా కలెక్టర్**





**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నగరంలో మరింత మెరుగ్గా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టేందుకు ఈ నెల 13 నుంచి పది రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. నగరంలో శనివారం ఉదయం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి బైపాస్ రోడ్, సారధినగర్, ఎఫ్.సి.ఐ. గోడౌన్ రోడ్ ల నందు కలినడకన తిరుగుతూ జిల్లా కలెక్టర్ పర్యటించారు. రోడ్ లకు ఇరువైపులా సైడ్ డ్రైన్ లు, చెత్త, పిచ్చి మొక్కలు, మట్టి పేరుకుపోయిన రోడ్డులను కలెక్టర్ పరిశీలించారు. నగరంలో చేపట్టే ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ప్రధాన రహదారులు, సెంట్రల్ డివైడర్స్, జంక్షన్ నందు పేరుకపోయిన మట్టిని శుభ్రపరిచే అధునికమైన పవర్ స్వీపింగ్ యంత్రాల పని తీరును ఎఫ్.సి.ఐ. గోడౌన్ రోడ్డులో క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ... ఖమ్మం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని నగర వ్యాప్తంగా పేరుకు పోయిన చెత్తను శుభ్రం చేసి, మురుగునీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నగరంలోని ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లలో ఎక్కడ చెత్త ఉండకుండా శుభ్రం చేయాలని, వర్షాల వల్ల పేరుకుపోయిన మట్టి తొలగించాలని అన్నారు. కార్మికులు, జవాన్ వారీగా రోజుకు డివిజన్ల్ లో ఏ ప్రాంతంలో ఎంతమేర రోడ్లు, కాలువలు శుభ్రం చేయాలో కార్యాచరణ చేయాలని అన్నారు. మున్సిపల్ శాఖ లోని ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధతో పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టాలని అన్నారు. చెత్త తో ఉన్న ప్రాంతాలను శుభ్రం చేసే ముందు, శుభ్రం చేసి తర్వాత ప్రజలకు తేడా తెలిసేలాగా ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన అదనపు కార్మికులు, జెసీబీలు, ట్రాక్టర్, స్వీపింగ్ యంత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. నగర వ్యాప్తంగా ఉన్న డ్రైయిన్ ల పూడికతీత పనులు చేపట్టాలని అన్నారు. ఏ రోజు తీసిన పూడికతీత అదేరోజు అక్కడి నుంచి తొలగించేలా కార్యాచరణ రూపొందించాలని అన్నారు. పబ్లిక్ పార్క్, బస్ స్టాప్స్, పబ్లిక్ టాయిలెట్స్ పూర్తిగా శుభ్రం చేయాలని అన్నారు. రోడ్డు మీద నిర్మాణ వ్యర్థాలు, ఎక్కడ పిచ్చి మొక్కలు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. నగరంలో ఉన్న ఫుట్ పాత్ లు, కూడలిలు, డివైడర్ లు శుభ్రంగా ఉంచాలని అన్నారు. ప్రధాన రహదారిపై ఎక్కడా గుంతలు లేకుండా, అధునిక టెక్నాలజీ జోడించి నిర్ధిష్టమైన మరమ్మత్తు పనులు చేయాలని, నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ యజ్ఞం లాగా ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ 10 రోజుల పాటు కొనసాగించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ అనిల్ కుమార్, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, గ్రీనరీ అధికారిణి రాధిక, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు, సూపర్వైజర్ లు, జవాన్ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతును రాజును చేయాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం

**ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి**



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రైతును రాజును చేయడం, పేదలకు సొంత ఇల్లు ఇవ్వడం, ప్రతి అర్హుడికి రేషన్ కార్డు, సంక్షేమ ఫలాలు అందించడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.శనివారం ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలంలో పర్యటించి మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలకు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి శంకుస్థాపన చేశారు. ముజ్జుగూడెం గ్రామంలో ముజ్జుగూడెం నుండి గువ్వలగూడెం వరకు రూ. 2.60 కోట్ల అంచనా వ్యయంతో బీటీ రోడ్డు, పైనంపల్లి గ్రామంలో రూ.15 లక్షల అంచనా వ్యయంతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ నాటినుండి ముజ్జుగూడెం గ్రామంలో 3.68 కోట్ల రూపాయలతో వివిధ రోడ్లు మంజూరు చేసుకొని కొన్ని పూర్తి చేసుకున్నట్లు, కొన్ని టెండర్ దశలో ఉన్నాయని అన్నారు. పైనంపల్లి గ్రామంలో 12.59 కోట్లతో రోడ్లు, వివిధ అభివృద్ధి పనులు చేసుకున్నట్లు మంత్రి తెలిపారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడే నాటికి ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలులో వెనక్కి తగ్గడం లేదని అన్నారు. ఆర్థిక పరిస్థితిని బాగు చేస్తూ 200 యూనిట్ల ఉచితవిద్యుత్, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. 25 లక్షల మంది రైతులకు 2 లక్షల వరకు రుణమాఫీ క్రింద 21 వేల కోట్లు ప్రభుత్వం ఏర్పడ్డ 9 నెలల్లోనే అందించామన్నారు. రైతు భరోసా సహాయం 12 వేలకు పెంచినట్లు, పోయిన నెలలో ఒకేసారి 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం సరఫరా, 11 లక్షల నూతన రేషన్ కార్డుల జారీ, పాత రేషన్ కార్డులలో 17 లక్షల కొత్త పేర్లు నమోదు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. సన్న వడ్లు పండించిన రైతులకు మద్దతు ధరతో పాటు క్వింటాకు 500 రూపాయల బోనస్ మొదటి విడత అందించామని, రెండో విడత అందించనున్నట్లు అన్నారు. గత ప్రభుత్వం పేదలకు సొంతిల్లు అందించే పథకం నిర్లక్ష్యం చేసిందని, ప్రజా ప్రభుత్వంలో 22 వేల 500 కోట్లతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసామని అన్నారు. పాలేరు నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామన్నారు. రాబోయే 3 సంవత్సరాలలో మూడు విడతల్లో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని అన్నారు. ప్రతి సోమవారం ఇళ్ళు కట్టుకున్న స్టేజిని బట్టి డబ్బులు లబ్ధిదారుని ఖాతాలో జమ చేస్తున్నామన్నారు. పేదల పక్షపాతి ఇందిరమ్మ ప్రభుత్వమని, ప్రజలు ఆదరించి, ప్రభుత్వానికి వెన్నంటి ఉండాలని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఇ యాకోబు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌జిటీ పోస్టులను రద్దు చేయడం సరికాదు

- ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయండి
- టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచింతల విష్ణువర్ధన్ రెడ్డి



**తొర్రూరు ప్రతినిధి, అక్టోబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా, తొర్రూర్ డివిజన్ కేంద్రంలో టిపిటిఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం ఏర్పాటు చేశారు .ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా టీపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచింతల విష్ణువర్ధన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి విష్ణువర్ధన్ రెడ్డి ప్రసంగిస్తూ సర్వీస్ లో ఉన్న సీనియర్ టీచర్స్ కు టెట్ అవసరం లేకుండా ప్రభుత్వం సుప్రీంకోర్టులో త్వరలో రివ్యూ పిటిషన్ వేయాలని అన్నారు.కామన్ సీనియారిటీతో ఎల్ ఎఫ్ ఎల్ ప్రమోషన్ ఉండాలనీ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలలోని ఎస్ జి టి సర్ ప్లేస్ పోస్టులను తగ్గించి హైస్కూల్ లో పి ఈ టి పోస్టులు ఇస్తే.. ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం అవుతాయి. అవే పోస్టులతో ప్రతి ప్రాథమిక పాఠశాలకు తరగతికి ఒక ఉపాధ్యాయున్ని ,ఒక ప్రధానోపాధ్యాయున్ని మరియు ఒక వ్యాయామ ఉపాధ్యాయున్ని నియమించాలని తెలిపారు. జిల్లా కార్యదర్శి టి రవీందర్ ప్రసంగిస్తూ ప్రాథమిక పాఠశాలల్లో ఒకరు లేదా ఇద్దరు టీచర్లతో 18 సబ్జెక్టులు బోధిస్తూ నాణ్యమైన విద్య అందించడం సాధ్యం కాదని, ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని సవరించి ప్రాథమిక పాఠశాలల్లో కనీసం ఇద్దరూ ఉపాధ్యాయులు ఒక హెడ్మాస్టర్ను మరియు ఒక వ్యాయామ ఉపాధ్యాయున్ని ఇవ్వాలని కోరారు. నరసింహులపేట టిపిటిఎఫ్ మండల అధ్యక్షులు క్రాంతి కుమార్, దంతాలపల్లి టి పి టి ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి చింతల సురేష్, టిపిటిఎఫ్ బాధ్యులు వెంకట్రామ నరసయ్య, ఏ యాకయ్య, పాషా, బొమ్మ శ్రీనివాస్, కే ఆంజనేయులు, భోగ సంపత్, కే సురేష్, అయితా కృష్ణ, మాదాసు రాములు, జి సంతోష్, ఎం యాకన్న, తదితరులు పాల్గొన్నారు.

# సమాజాన్ని విషపూరితం చేస్తున్న బీజేపీ - ఆర్ఎస్ఎస్

- హర్యానాలో కులవివక్ష కాటుకు బలైన దళిత ఐపిఎస్
- ఘటనపై సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలి
- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మత విద్వేషాలు, కుల వివక్షత, ప్రాంతీయ భేదాలతో బీజేపీ - ఆర్ఎస్ఎస్ సమాజాన్ని విషపూరితం చేస్తున్నాయని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ ఆరోపించారు.హర్యానాలో ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఐపీఎస్ ఆఫీసర్ పోరన్ కుమార్ కులవివక్ష అవమానాన్ని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమని, ఇదీ ముమ్మాటికీ అగ్ర కుల ఆధిపత్య హత్యేనని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఒక ఐపీఎస్ ఆఫీసర్ స్థాయిలో ఉన్న దళితుడికే ఇంత అవమానం జరిగితే సామాన్య దళితుడు పరిస్థితి ఏంటి, దళితులకు సామాన్యులకు జరుగుతున్న అన్యాయానికి ఇది నిదర్శనం అని పేర్కొన్నారు. దేశంలో నేడు బిజెపి - ఆర్ఎస్ఎస్ మనువాద సిద్ధాంతం పేరుతో మత విద్వేషాలు, కులవివక్షత, ప్రాంతీయ భేదాలతో సమాజాన్ని విషతుల్యం చేస్తున్నాయని దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలని వారు పిలుపునిచ్చారు. ఐపీఎస్ మృతి పట్ల తక్షణమే సిట్టింగ్ న్యాయమూర్తి చేత విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

# బిసిల రిజర్వేషన్‌లను అడ్డుకున్న పాపం బీజేపీ, బిఆర్ఎస్‌లదే

- బీసీలకు ఇచ్చిన హామీకి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది
- కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వేల్పుల మురళి



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 9తో పాటు స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే విధించడం దురదృష్టకరమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వేల్పుల మురళి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సహకారంతో ఇంటింటికి తిరిగి కులగణన చేసి 42 శాతం బీసీ రిజర్వేషన్ల రూపొందించినట్టు ఆయన గుర్తుచేశారు. బీఆర్ఎస్ - బీజేపీ ఒక్కటై బీసీలకు న్యాయం జరగకుండా అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం 42 శాతం బీసీల రిజర్వేషన్ కు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. బీసీలకు న్యాయం జరగాలని అభిప్రాయపడ్డారు. బిఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒక్కటై బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నాయని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ కొలిక్కి వచ్చిందనుకున్న సమయంలో కోర్టు తీర్పు ఊహించలేదని చెప్పారు. బీసీల నోటి కాడ కూడు లాగేయడం శోచనీయమని పేర్కొన్నారు. బీసీలు అధైర్య పడాల్సిన అవసరం లేదని, బీసీ రిజర్వేషన్ బిల్లును రెండు సభల్లో పాస్ చేసి గవర్నర్ కు పంపించామని, గవర్నర్ బిల్లు పాస్ చేయకుండా అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్ర కులాలకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చే సమయంలో తాము అడ్డుకోలేదని, బీసీలకు రిజర్వేషన్లు ఇస్తే అడ్డుకుంటారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కార్తీక మాసం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం "పాంచారామాల" భక్తి యాత్ర టూర్ ఏర్పాటు

- ప్రకటన ద్వారా వెల్లడించిన తొర్రూర్ డిఎం పద్మావతి





**తొర్రూరు ప్రతినిధి, అక్టోబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** కార్తీక మాసం సందర్భంగా ప్రతి ఆదివారం రాత్రి 08:00 గంటలకు తొర్రూర్ డిపో నుండి బయలుదేరి,సోమవారం పాంచారామాల దర్శనం చేసుకొని,మంగళవారం తొర్రూర్ డిపోకు తిరిగి చేరుకుంటుందని డిఎం పద్మావతి తెలిపారు.యాత్రలో భాగంగా దర్శించబడే పవిత్ర స్థలాలు:అమరారామం (అమరావతి), సోమనాథం (భీమవరం), రామలింగేశ్వర స్వామి దేవాలయం (పాలకొల్లు), ద్రాక్షారామం, కుమారారామం (సామర్లకోట).భక్తుల సౌకర్యార్థం సూపర్ లగ్జరీ బస్సు మొత్తం 36 సీట్లు లభ్యమవుతాయి.టికెట్ ధర 2200 రూపాయలుగా నిర్ణయించబడింది.కనీసం 30 మంది భక్తులు నమోదు అయిన తర్వాత టూర్ బయలుదేరుతుందని అన్నారు .భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని టీజీఎస్ ఆర్టిసి తో భక్తితో, భద్రంగా తమ యాత్రను పూర్తి చేసుకోవాలని తొర్రూర్ డిపో మేనేజర్ కోరారు.ఆన్లైన్ బుకింగ్ సర్వీస్ నెంబర్ :80744.అదేవిదంగా "అరుణాచలం" 03-11-2025 రోజు మధ్యాహం 15:00 కి బయలుదేరి స్వయం భూ వరసిద్ధి వినాయక దేవస్థానం కాణిపాకం, శ్రీ లక్ష్మినారాయణ గోల్డెన్ టెంపుల్, సిరిపురం, అరుణాచలేశ్వరాలయం తిరువాన్నామలై, జోగులాంబ ఆలయం అలంపూర్, బీచుపల్లి శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం దర్శించుకొని 06-11-2025 రోజు తిరిగి డిపో చేరుకుంటుంది. దీనిని ఆన్లైన్ బుకింగ్ కొరకు సర్వీస్ నెంబర్: 80745. వివరాలు మరియు బుకింగ్స్‌కి సంప్రదించవలసిన నంబర్లు:8074474984, 7032182456, 9959226053

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ప్రజల సౌకర్యవంతమైన జీవనానికి మౌళిక వసతుల కల్పన





**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అభివృద్ధి పనుల్లో వేగం పెంచి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంత్రివర్యులు, శనివారం ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ పరిధి 42వ డివిజన్ లో పర్యటించి మునిసిపల్ సాధారణ, టియుఎఫ్ఐడిసి నిధులు 92 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లు, సీసీ సైడ్ డ్రైన్ లు, వాటర్ సప్లై పైప్ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ... ఖమ్మం నగర కార్పొరేషన్ పరిధిలో మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని, ప్రజల సౌకర్యవంతమైన జీవనానికి సిసి రోడ్లు పెద్ద ఎత్తున నిర్మిస్తున్నామని, భవిష్యత్తుకు అనుగుణంగా కొత్త రోడ్లు, డ్రైయిన్లు నిర్మిస్తున్నామని తెలిపారు. 6వ డివిజన్ పరిధిలో పూర్తి స్థాయిలో రోడ్డు డ్రైన్ నిర్మాణ పనులు పూర్తి చేస్తామని అన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, బెస్ట్ అవెలెబుల్ స్కూల్ విద్యార్థులు, ఫీజు రిఅంబర్స్ మెంట్ సమస్యలను మంత్రి వర్గ క్యాబినెట్ లో చర్చించామని, గత ప్రభుత్వం చేసిన బకాయిల వలన ఈ ప్రభుత్వం పెద్ద మొత్తంలో అప్పులు చెల్లించవలసిన పరిస్థితి వచ్చిందన్నారు. విద్యార్థులు భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి నిధులు విడుదల చేస్తారని అన్నారు. నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. ఖమ్మం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా తమ వంతు సహకారం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్ల వెడల్పుతో నగరం సుందరంగాను, ప్రజలకు సౌకర్యవంతంగాను ఉంటుందన్నారు. రోడ్ల వెడల్పు తో ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, స్థానిక కార్పోరేటర్ పాకాలపాటి విజయనిర్మల శేషగిరిరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు కళ్యాణం కృష్ణయ్య, మేదరమెట్ల సుబ్బయ్య
- ఈనెల 13న కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన ధర్నా




**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** 30, 40 సంవత్సరాలుగా ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేసి పదవీ విరమణ పొందిన రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు కళ్యాణం కృష్ణయ్య, మేదరమెట్ల సుబ్బయ్య లు అన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ బకాయిలను గత 18 నెలలుగా విడుదల చేయకుండా ఫెన్షనర్లను ఇబ్బందులకు గురిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ అక్టోబర్ 13న ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. శనివారం పెన్షనర్స్ భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... ఖమ్మం జిల్లాలో పెన్షనర్ల ప్రయోజనాలు నేటివరకు అందకపోవడంతో అనేక సమస్యలతో సతమతమవుతూ ఇప్పటికే 10 మంది పెన్షనర్లు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి 2024 తర్వాత రిటైర్డ్ అయిన వారికి జిపిఎఫ్, కమ్యూటేషన్, ఆర్జిత సెలవుల నగదు చెల్లింపులు చెల్లించకపోవడంతో వేలాది మంది పెన్షనర్లు తీవ్ర ఆర్థిక, మానసిక, అనారోగ్య, కుటుంబ సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెలవారి పెన్షన్ తప్ప మిగిలిన ప్రయోజనాలు విడుదలకావడం లేదని దుయ్యబట్టారు. ఖమ్మం కలెక్టరేట్లో ఉన్న సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని ఖమ్మం లోకి మార్చాలని, ప్రభుత్వ ఆసుపత్రులు గల వెల్నెస్ సెంటర్లో మందులు కొరత తీవ్రంగా ఉందని, అన్ని రకాల పరీక్షలు నిర్వహించడం లేదని అన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కరించాలని కోరారు. పెన్షనర్లకు న్యాయంగా రావలసిన ఐదు డిఏలు, పిఆర్సి లను వెంటనే విడుదల చేయాలని కలెక్టర్ ను కోరారు. 13న జరిగే నిరసన ధర్నా కార్యక్రమానికి పెన్షనర్స్ అందరూ కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తాళ్లూరి వేణు, డీకే శర్మ, పి. సాంబశివరావు, ఎస్. పూర్ణచంద్రరావు యూనిట్ నాయకులు వెంకటనారాయణ వెంకటనారాయణ, సిహెచ్ బాబు, ఎస్ సత్యనారాయణ, కె. మురళి పాల్గొన్నారు.

# బాలికలదే భవిష్యత్తు - ఆకాశమే హద్దుగా ఎదగాలి

- కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ బండారు ఇందిర
- కెజిబివి పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం








**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాబోయే కాలంలో భవిష్యత్ ఆడపిల్లలదేనని, అపారమైన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆకాశమే హద్దుగా ఎదగాలని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ బండారు ఇందిర అన్నారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 11 'అంతర్జాతీయ బాలిక దినోత్సవం' ను పురస్కరించుకుని శనివారం స్థానిక లక్ష్మీపురం కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బండారు ఇందిర మాట్లాడుతూ... అంతర్జాతీయ బాలికల దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబరు 11న నిర్వహించబడుతోంది. బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను, అనర్థాలను నివారించి, వారి హక్కులను తెలియజేసేందుకు ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని ప్రకటించింది. అమెరికన్ పౌరహక్కుల కార్యకర్త ఎలానార్ రూజ్‌వెల్ట్ మహిళల ఆత్మగౌరవం కాపాడడం కోసం పోరాటం చేసిన ఎలానార్ రూజ్‌వెల్ట్ పుట్టిన రోజైన అక్టోబరు 11ను అంతర్జాతీయ బాలికల దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి గుర్తించింది అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 2012, అక్టోబరు 11న తొలిసారిగా ఈ దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా జరుపబడుతుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలు, విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, హింస, బలవంతపు బాల్య వివాహాలు, వివక్షతపై అవగాహన పెంచడం ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. బాలికలు, యువతులు వారివారి రంగాలలో ప్రచారం, పరిశోధనలకు సంబంధించి సాధించిన అభివృద్ధిని ప్రతిబింబించేలా ఈ దినోత్సవ వేడుకలు తమ పాఠశాలలో చేస్తున్నట్లు ఆమె తెలిపారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సంస్థ కో-ఆర్డినేటర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ... బాలికలను అన్ని రంగాల్లో ముందు ఉంచడానికి తమ సంస్థ తరపున నిరంతరం క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖల వారి సహాయ సహకారాలతో పనిచేస్తున్నామని తెలిపారు. బాల్యవివాహాలను, బాలలపై లైంగిక దాడులను, బాలల అక్రమ రవాణాను నిరోధించడానికి, వారికి రక్షణగా, అండగా సంస్థ పనిచేస్తుందని తెలిపారు. బాల్యవివాహాలను నిర్వహించే వారిపై, ప్రోత్సహించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ఎవరైనా బాల్య వివాహాలు నిర్వహిస్తున్నట్లయితే వెంటనే చైల్డ్ లైన్ 10982, పోలీస్ డైల్ 100కు ఫోన్ చేసి తెలపాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దల సహాయ సహకారాలతో 2030 నాటికి బాల్య వివాహాలు లేని ఖమ్మం జిల్లాను చూడడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పూజారి నల్లాన్ చక్రవర్తుల కార్తీక్ చార్యులు, పాస్టర్ డేవిడ్ రాజ్, ఖాజీ అబ్దుల్లా పాల్గొని బాల్యవివాహాలను ఏ మతం కూడా ప్రోత్సహించదని, ఎవరూ బాల్యవివాహాలు చేసుకోవద్దని, తాము కూడా బాల్య వివాహాలు చేయబోమని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్రత్యేక అధికారిని ఇందిర, కమిటీ చైర్పర్సన్ ను మత పెద్దలు బొకే ఇచ్చి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్ సంస్థ సభ్యులు రామదాసు రవిచంద్ర, కేజీబీవీ ఉపాధ్యాయునులు రాధ, సఫీయా భేగం, జ్యోతి, నాగమణి, కవిత, యాస్మిన్, సుకన్య, నిర్మల, నాగలక్ష్మి, ఉమాదేవి, సుజాత, రజిని, సుమలత(తెలుగు), సుమలత (ఫిజిక్స్) స్వాతి, ఉమ, మాధవి, పిఈటి సునీత, ఎఎన్ఎం రేణుక, అనూష, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాజకీయ లబ్ధికోసమే రిజర్వేషన్లతో ఆట..!

**● చట్టంను మించిన రేవంత్ అహంకారం ● హైకోర్టు స్టే ప్రభుత్వం వైఫల్యానికి చిహ్నం ● బీసీల హక్కులు తాకట్టు..! ● జిల్లా మంత్రులు కమిషన్ కోసమే పని చేస్తున్నారు ● రెండేళ్లు దాటిన జిల్లాలో కనిపించిన ప్రగతి ● కేంద్ర ప్రభుత్వ నిధులను మావని చెప్పుకోవడం శోచనీయం ● మీడియా సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు**



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయాల వల్ల బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు విధించిన స్టే రాష్ట్ర ప్రజాస్వామ్య చరిత్రలో కాంగ్రెస్ పాలనకు నల్లపేజీగా నిలిచిందని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు తీవ్ర విమర్శలు గుప్పించారు. శుక్రవారం బిజెపి పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాజకీయ లబ్ధికోసం చట్టాన్ని తాకట్టు పెట్టిన ఈ ప్రభుత్వం ఇప్పుడు న్యాయస్థానం చేతిలో చెంపదెబ్బ తిన్నదని ఘాటుగా వ్యాఖ్యానించారు.రేవంత్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు బీసీ వర్గాల మద్దతు సంపాదించాలనే ఉద్దేశంతో తొందరపాటుగా రిజర్వేషన్లను ప్రకటించిందని విమర్శించారు. కానీ ఆ ప్రక్రియలో సుప్రీంకోర్టు స్పష్టంగా సూచించిన 'ట్రిపుల్ టెస్ట్' ప్రమాణాలను విస్మరించిందని కోటేశ్వరరావు మండిపడ్డారు. బీసీ వర్గాల సామాజిక, విద్యా స్థితిగతులపై స్వతంత్ర కమిషన్ నివేదిక లేకుండా, ప్రభుత్వ అంచనాల ఆధారంగా రిజర్వేషన్ల శాతం నిర్ణయించడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన తెలిపారు. ఈ ప్రభుత్వానికి చట్టపరమైన అవగాహన లేకపోవడం కాదు, కావాలనే నిర్లక్ష్యం చేయడం అన్నారు. చట్టం కంటే రాజకీయ లబ్ధి ముఖ్యం అన్న ధోరణి తెలంగాణ పాలనలో స్థిరపడిందని ఆయన మండిపడ్డారు.హైకోర్టు స్టే వెనుక ఉన్న అసలు కారణం రేవంత్ ప్రభుత్వ అహంకారం, అధికార దుర్వినియోగమేనని కోటేశ్వరరావు అన్నారు. న్యాయ సలహాలను పట్టించుకోకుండా, అధికారుల సూచనలను పక్కన పెట్టి, కేవలం రాజకీయ ఒత్తిళ్లకు లోనై తీసుకున్న నిర్ణయాలు ఈ అవమానకర పరిస్థితికి దారి తీశాయి. ప్రజాస్వామ్యంలో చట్టం కంటే పెద్దది ఏదీ లేదు. కానీ రేవంత్ ప్రభుత్వం చట్టాన్ని కాళ్ల కింద వేసి పరిపాలన చేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు.హైకోర్టు స్టేతో ఎన్నికల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయి పంచాయతీలు, మండలాలు, మున్సిపాలిటీలలో పరిపాలన స్తంభించిందని, ప్రజలకు అవసరమైన సేవలు అందడం కష్టమౌతుందని ఆయన వివరించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే హక్కు న్యాయవ్యవస్థదేనన్నారు. అందుకే హైకోర్టు ప్రజల తరఫున మాట్లాడింది. ఇది కేవలం రిజర్వేషన్లపై తీర్పు కాదు ఇది రేవంత్ ప్రభుత్వ అహంకారంపై తీర్పు అని కోటేశ్వరరావు పేర్కొన్నారు.బీసీ వర్గాల అసంతృప్తి రోజురోజుకీ పెరుగుతోందని, నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో కాంగ్రెస్‌పై విరక్తి వ్యాపిస్తున్నదని ఆయన అన్నారు. బీసీలు అడుగుతున్నారు – మాకు న్యాయం ఎక్కడ..? రిజర్వేషన్ల పేరుతో మోసం చేసిన ఈ ప్రభుత్వం నైతిక హక్కు కోల్పోయిందని ఆయన విమర్శించారు. బీసీ సమాజాన్ని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ ఇక రాజకీయంగా తట్టుకోలేదని ఆయన వ్యాఖ్యానించారు. కేవలం రాజకీయ లాభం కోసం చట్టాన్ని ఉల్లంఘించే ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి ప్రమాదం అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం న్యాయపరమైన పునాదులు లేకుండా నిర్ణయాలు తీసుకుంది. రాజ్యాంగం చెప్పిన సూత్రాలను విస్మరించింది. ఇలాంటి ప్రభుత్వాన్ని ప్రజలు తప్పకుండా శిక్షిస్తారు అన్నారు. "హైకోర్టు తీర్పు కేవలం ఒక కేసు కాదు, ఇది ఒక బోధ. చట్టం పైనే రాజకీయం ఉండాలి. చట్టాన్ని లెక్కచేయని నాయకత్వం ప్రజల విశ్వాసం కోల్పోతుందిని ఆయన స్పష్టం చేశారు.ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ ప్రధానమైన సమస్యలు అలాగే ఆగిపోయాయని విమర్శించారు. ముగ్గురు మంత్రులు కూడా కేవలం కమిషన్ కోసమే పనులు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. ప్రతి పనిలో కూడా కమిషన్ తీసుకోకుండా మంత్రులు పనిచేస్తున్న దాఖలాలు ఎక్కడా కూడా కనిపించట్లేదని ఆరోపించారు. అంతే కాకుండా కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం విడుదల చేసిన నిధులను సైతం మేమే తీసుకువచ్చామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పామాయిల్ సాగు విషయంలో కంపెనీ యజమానులు నకిలీ మొక్కలు పంపిణీ చేసి రైతులను నష్టపరిచినప్పటికీ, ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నకిలీ మొక్కల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారంతో పాటు మొక్కలను కూడా మరల ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న అనేక సమస్యలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడంలేదన్నారు. ప్రజా సమస్యలపై తక్షణమే పరిష్కారం చూపించకపోతే జిల్లా వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ పెద్ద ఎత్తున ఆందోళన దిగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శులు గుత్తా వెంకటేశ్వరరావు, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు వీరవల్లి రాజేష్ గుప్తా, కందుల శ్రీకృష్ణ, జిల్లా మీడియా కన్వీనర్ డాక్టర్ నెల్లూరి బెనర్జీ, బోయినపల్లి సురేష్, ఖమ్మం టూ టౌన్ ప్రధాన కార్యదర్శి రుద్రగాని మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# “పర్ణశాలల పండుగ” 4వ మహోత్సవము

**● “యాషువ మెస్సీయ” (క్రీస్తు) జన్మదినమే ‘పర్ణశాలల పండుగ’ ● బైబిల్ గ్రంధంలో ‘పర్ణశాలల పండుగ’ గూర్చి 359 సార్లు వ్రాయబడినది ● ప్రవక్తలు, మెస్సీయ (యేసుక్రీస్తు), శిష్యులు, అపోస్తులలు ‘పర్ణశాలల పండుగ’ను ఆచరించారు ● బైబిల్ గ్రంధాన్ని పరిశుద్ధంగా ఆచరించే జనులందరూ ‘పర్ణశాలల పండుగ’ను తప్పక ఆచరించాలి ● యావె సమాజ ప్రార్ధన మందిర పాస్టర్ పాలడుగు రత్నపాల్**









**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** లోక పాప పరిహారార్థమై, పాపులను రక్షించుటకొరకే యాషువ మెస్సీయ (యేసుక్రీస్తు) ఈ లోకములో జన్మించెను. ఆయన జన్మదినమే “పర్ణశాలల పండుగ” ఇది వెయ్యేండ్ల మహోత్సవము అని యావె సమాజ ప్రార్ధన మందిర పాస్టర్ పాలడుగు రత్నపాల్ అన్నారు. యాషువ మెస్సీయ జన్మదినాన్ని పురస్కరించుకుని 8 రోజుల పర్ణశాలల మహోత్సవాలలో భాగంగా ఖమ్మం నగరంలోని రమణగుట్టలో యావె సమాజ ప్రార్థనా మందిరంలో “4వ రోజు పర్ణశాలల పండుగ” మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ రత్నపాల్ లు మాట్లాడుతూ.. పాప పరిహారార్థమై మానవులు చేసిన పాపాలను తొలగించి, సత్యమును గూర్చి సాక్ష్య మిచ్చుటకే యాషువ మెస్సీయ ఈ లోకములో జన్మించెనని తెలిపారు. ఆయన జన్మదినాన్ని గుర్తుచేసుకొని ఆచరించడమే “పర్ణశాలల పండుగ పరమార్థం” అన్నారు. నమ్మినవారు ధన్యులు. వారిదే పరలోక రాజ్యం అన్నారు. ఈ పర్ణశాలల పండుగ గూర్చి పరిశుద్ధ గ్రంథంలోని బైబిల్ క్యాలెండర్ 7వ నెల ఏతనీము 15వ తేదీన పుట్టాడని, దానినే పర్ణశాలల పండుగ అంటారని తెలిపారు. బైబిలంతటిలో ప్రవక్తలు, యాషువ మెస్సీయ, శిష్యులు, అపోస్తులలుతో పాటు బైబిల్ జ్ఞానమెరిగిన ఈ లోక జనులు పండుగను అనుసరిస్తూ ఆచరిస్తున్నారని పేర్కొన్నారు. ఇది 8 దినముల ఉత్సవముతో కూడిన పర్ణశాలల పండుగని, ఇది ఎలోహిం ప్రజలైన ఇశ్రాయేలీయుల ఆచారమన్నారు. పర్ణశాలల పండుగ గూర్చి బైబిల్ అంతటిలో 359 సార్లు గొప్పగా వ్రాయబడిందని, ఇది సెప్టెంబర్–అక్టోబర్లో వచ్చే పౌర్ణమికి దగ్గరగా ఉంటుందని తెలిపారు. పర్ణశాలల మహోత్సవాలలో ధర్మశాస్త్రములోని 613 ఆజ్ఞలను 8 రోజులలో ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన గొప్ప పండుగన్నారు. బైబిల్ పండుగలు, (సబ్బాత్) విశ్రాంతిదినం, నెలపొడుపు దినం, ధర్మశాస్త్రమును అనుసరించేవారే పరలోక రాజ్యానికి వారసులని స్పష్టం చేశారు. ధర్మశాస్త్రము కొట్టివేయబడలేదు, సబ్బాత్ నిజమైన ఆరాధన అని తెలియజేశారు. 1యోహాను 3:4 ప్రకారం 'ధర్మశాస్త్రము(ఆజ్ఞ) అతిక్రమమే పాపము. పాపము వలన వచ్చు జీతం మరణము' అన్నారు. ధర్మశాస్త్రమును అనుసరించే ఈ పండుగను ఆచరించాలన్నారు. పర్ణశాలల పండుగ(సుక్కోతు) పాత నిబంధన లేవియాకాండం 23:34, అలాగే జెకర్యా 14:18 ప్రకారం పర్ణశాల పండుగ ఆచరించుటకై రాని అన్యజనులకు, తాను నియమించిన తెగులుతో యావె వారిని మొత్తును అన్నారు. కొత్త నిబంధన మోహాను 7:2,8, ప్రకటన 1:3, 22:14లో పర్ణశాల పండుగ గురించి వ్రాయబడిందన్నారు. పరలోక రాజ్యం చాలా దగ్గరగా ఉందని దానికోసం సిద్ధపడాలన్నారు. కానీ కొందరు బైబిల్ లో లేని పండుగలు, దినాలు, సంఘాలను సృష్టించి, మానవ కల్పిత ఆచారాలను గ్రహించక అబద్ధబోదను ఆచరిస్తున్నారని, ప్రకటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశుద్ధ గ్రంథమైన బైబిల్ ను ప్రామాణికంగా తీసుకొని హీబ్రు, గ్రీకు, ఆంగ్లం, తెలుగు భాషలు, చరిత్ర పుస్తకాలలో శాస్త్రీయంగా, క్షేత్రస్థాయిలో, నిశిత పరిశీలన చేసి భయభక్తులతో 'సత్యమైన వాక్యాన్ని' గ్రహించి ఆచరించాలని విజ్ఞప్తి చేశారు. పండుగలో విశ్వాసులు, యువకులు, చిన్నారులు భక్తి శ్రద్ధలతో పాటలు పాడి పరమతండ్రిని కొనియాడారు. అనంతరం సువార్త సహకారులు, సంఘ పెద్దలు ప్రత్యేక ప్రార్ధనలు జరిపారు. ఈ పర్ణశాలల పండుగ మహోత్సవంలో మోదుగు మోసే, బాసిపొంగు ప్రసాద్, అంబోజి ఐజక్, కొరకొప్పుల దేవిడ్, వంగూరి ఏలీయా, జిల్లా యోసేపు, జితేందర్, మోదుగు హానోకు, కొరకొప్పుల సునీత, జిల్లా ఉమారాణి, రూతు, స్వరూప, సుజాత, ప్రభావతి, యువకులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# దేవుని పేరుతో భూ కబ్జా చేయడం ఏంటి..?



**పద్మశాలి భవన్ ట్రస్ట్ పై నేతల ఆగ్రహం**

**కబ్జా భూమి చుట్టూ కాంపౌండ్ వాల్ కట్టాలి**

**సింగరేణి యాజమాన్యానికి అఖిలపక్ష నాయకుల డిమాండ్**



**బెల్లంపల్లి అక్టోబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో పద్మశాలి భవన్ గోడను ఆనుకొని ఉన్న సౌత్ క్రాస్ కట్ ఘని భూమిని దేవుడి పేరుతో కబ్జా చేయుట సరైనది కాదని సిపిఐ, కాంగ్రెస్, టిడిపి, బిఆర్ఎస్, సిపిఐ ఎంఎల్ రెడ్ స్టార్ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని రాజకీయ పార్టీల అఖిలపక్షం భూమి వద్దకు చేరుకొని అక్కడి పరిస్థితులను అర్థం చేసుకొని పద్మశాలి భవన్ ట్రస్ట్ వారు భూమిలోకి రెండు గేట్లు ఓపెన్ చేసి భూకబ్జాకు పాల్పడుతున్నారని, సింగరేణి యాజమాన్యం ఇట్టి భూమిని కబ్జా కి గురి కాకుండా చూడవలసిందిగా ప్రజా ప్రయోజనాలకు ఈ భూమిని ఉపయోగించాలని మాజీ మున్సిపల్ చైర్మన్ మత్తమారి సూరిబాబు, సిపిఐ, ఏఐటియుసి సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లి వెంకట్ స్వామి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి ప్రభుత్వ భూములు కబ్జా చేయుటకు రియల్ ఎస్టేట్ మాఫియా పూనుకోవడాన్ని ఖండిస్తూ ఇట్టి భూమిని ఎట్టి పరిస్థితుల్లో కబ్జా కాకుండా అఖిలపక్షంగా డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే గడ్డం వినోద్, సింగరేణి యాజమాన్యం ఈ భూమి కబ్జా కాకుండా చూడాల్సిందిగా కోరుతూ, బెల్లంపల్లి కోల్ బేరింగ్ ఏరియా, బెల్లంపల్లి పట్టణంలో 12 గనులు నడిచినై ఇందులో కూడా 50% మాత్రమే బొగ్గును తీయడం జరిగింది, ఇంకా 50% బొగ్గు అలాగే ఉంది, ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం శ్రావణపల్లి అండర్ గ్రౌండ్ మైన్, ఓపెన్ కాస్ట్ ను ప్రారంభించి ఇక్కడ ఉన్న యువతకు ఉపాధి కల్పించాల్సిందిగా కోరడం జరిగింది. 10 సంవత్సరాల క్రితం సింగరేణి సూపర్ బజార్ దగ్గర పెద్ద గొయ్యి ఏర్పడిందని అందులోంచి వచ్చే నీరు కాలనీలోని నివాసాలలోకి వచ్చి ప్రజలు పడుకో లేని స్థితి ఏర్పడిందని అంతటి ప్రమాదకరమైనటువంటి ఈ భూమిని కబ్జాదారులు కబ్జా చేసి షాపింగ్ కాంప్లెక్స్ కట్టాలనే ఆలోచన దురదృష్టకరమని వారన్నారు, ఇది అబెండెడ్ మైన్ అంటే నిషేధిత ప్రాంతం కనుక ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని సింగరేణి యాజమాన్యం ఇట్టి భూమిని చుట్టూ కాంపౌండ్ వాల్ కట్టి కబ్జాదారుల నుంచి రక్షించవలసిన అవసరం ఉందని వారన్నారు, ఈ సందర్భంగా సిపిఐ ఎం ఎల్ రెడ్ స్టార్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోగర్ల శంకర్ మాట్లాడుతూ పద్మశాలి సంఘం పేరుపైన గుడి కట్టి దాని వెనకాలే ట్రస్ట్ పేరుతో ఫంక్షన్ హాల్ కట్టి వ్యాపార దోపిడీకి పాల్పడుతున్నారని, ప్రభుత్వం ఈ భూమి నీ పేద ప్రజలకు పంచవలసిందిగా వారు కోరినారు, పద్మశాలి భవన్ ట్రస్ట్ సభ్యులు ఈ భూమి నీ కబ్జా చేయుటకు తహతహలాడుతున్నారని ఈ కబ్జాని అఖిలపక్షం ముక్తకంఠంతోటి వ్యతిరేకిస్తుంది వారన్నారు, అఖిలపక్షంగా సింగరేణి యాజమాన్యాన్ని కోరడం జరుగుతుంది పద్మశాలి భవన్ నుండి ఈ భూమిలోకి రావడానికి వేసిన గేట్లను వెంటనే మూసివేయాలని మీరు మూయని యెడల మేమే మూసేస్తామని తక్షణమే వాటిని బంద్ చేయాలని వారు అన్నారు, అన్ని పార్టీలు నాయకులు ఈ కబ్జాకు వ్యతిరేకంగా ఇక్కడికి రావడం కబ్జాను అడ్డుకోవడం ఎంతో సంతోషదాయకమని ఎట్టి పరిస్థితిలో ఈ భూమి సింగరేణి యాజమాన్యం ఆధీనంలోకి కి



తీసుకోవాలని లేదా వార్డు లోని పేద ప్రజలకు ఇవ్వాలని వారి కోరినారు, ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, టిడిపి పట్టణ అధ్యక్షులు మనిరాంసిం, మాజీ కౌన్సిలర్ గెల్లి



రాజలింగు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గెల్లి జయరామ్, 31 వ వార్డు టిఆర్ఎస్ వార్డు అధ్యక్షులు ప్రవీణ్, బెల్లంపల్లి బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఎండి అఫ్జల్, టిపిసిసి మీడియా కమ్యూనికేషన్ జిల్లా కన్వీనర్ దేవసాని ఆనంద్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు రత్నం రాజం, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కొంకుల రాజేష్, బికేఎంయు జిల్లా కార్యదర్శి గుండ చంద్ర మాణిక్యం, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, టిడిపి నాయకులు బి మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ జనరల్ సెక్రెటరీ ఆడెపు మహేష్, అఖిలపక్ష నాయకులు గోలేటి రాయలింగు, శనిగరపు రాజేందర్, జంజిరాల మనోహర్, కుమ్మరి శంకర్, ప్రదీప్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు

# రసవత్తరంగా టేబుల్ టెన్నిస్ రెండవ రోజు పోటీలు

**• టేబుల్ టెన్నిస్ రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ పోటీలలో అత్యంత ప్రతిభను కనపర్చిన బాలసాని అక్క చెల్లెళ్లు**







ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) : కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ లేదని బాలసాని విజయ్ కుమార్తెలు ఇద్దరు తన్మయ్, హారికలు నిరూపిస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా టేబుల్ టెన్నిస్ క్రీడలో సర్దార్ పటేల్ స్టేడియం నందు శిక్షణ తీసుకుంటూ పలు టోర్నమెంట్లో ఆడి ప్రస్తుతం ఖమ్మం నగరంలో సర్దార్ పటేల్ స్టేడియం నందు 1వ బాలసాని సన్యాసయ్య రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ పోటీల్లో రెండవ రోజు శనివారం మెరుగైన ఆటలను ప్రదర్శించారు. అక్కాచెల్లెళ్లు చదువులోనూ, ఇటు క్రీడల్లోనూ ఆసక్తిని కనుబరుస్తున్నారు. ఈనెల 10వ తారీఖున ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామరెడ్డి ప్రారంభించిన టేబుల్ టెన్నిస్ రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ పోటీలలో చక్కని ప్రతిభను కనబరుస్తున్నారు. టేబుల్ టెన్నిస్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులుగా బాలసాని విజయ్ గత సెప్టెంబర్ మాసంలో సర్దార్ పటేల్ స్టేడియం నందు నూతన ఇండోర్ స్టేడియంను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదగా ప్రారంభించుకుని ఖమ్మం టేబుల్ టెన్నిస్ క్రీడాకారులకు చక్కని అవకాశాలు కల్పిస్తున్నారు. అవకాశాలు కల్పించడమే కాకుండా తన కూతుళ్లు ఇద్దరిని టేబుల్ టెన్నిస్ క్రీడలలో ఆడించటం పట్ల ఖమ్మం జిల్లా టేబుల్ టెన్నిస్ పై ఉన్న ఆసక్తి అభివృద్ధికి బాటలు వేసారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఇండోర్ స్టేడియం ప్రారంభించుకోవడం వల్ల ఖమ్మం క్రీడాకారులను జాతీయ అంతర్జాతీయ పోటీలకు తయారు చేసేందుకు మెరుగైన శిక్షణ ఇవ్వవచ్చని ఆయన తెలిపారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడమే కాకుండా పిల్లల జీవిత నైపుణ్యాలు కూడా అభివృద్ధి చెందుతాయని అన్నారు. విద్యార్థి దశలో క్రీడా కార్యకలాపాలు, నీతి విలువలు, క్రమశిక్షణ, పరస్పర భావనలు బోధిస్తాయని, అలాగే క్రీడాకారులు స్ఫూర్తి జీవితంలోని వివిధ దశలను ఎదుర్కొనటానికి సహాయపడతాయని ఆయన తెలిపారు. అంతేకాకుండా క్రీడాకారులకు వివిధ రంగాల్లో వారి సమయ నిర్వహణ నైపుణ్యాలను మెరుగుపరచడంలో సహాయపడుతుందని అన్నారు. ఈ క్రీడల వల్ల క్రీడాకారులకు పరస్పర గౌరవం, నిజాయితీ, అంకితభావం, ప్రశంసలు పెంపొందిస్తాయని అన్నారు. అందువల్లనే తన ఇద్దరి కుమార్తెలను టేబుల్ టెన్నిస్ క్రీడలో ఆడించడమే కాకుండా ఖమ్మం జిల్లా క్రీడాకారులకు అత్యంత విలువైన సామాగ్రి ద్వారా ఖర్చును వెచ్చించి రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ టోర్నమెంట్లను జరిపించడం, క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ద్వారా వారికి అవకాశం కల్పిస్తూ అలాగే ఖమ్మం జిల్లా టేబుల్ టెన్నిస్ క్రీడను ముందుకు తీసుకుపోవటానికి కృషి చేస్తున్నట్లు బాలసాని విజయ్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

# బీసీ రాజకీయ రాష్ట్ర మహాసభల కరపత్రాలు విడుదల

**• బీసీ రాజకీయ రాష్ట్ర మహాసభల జయప్రదం చేయాలి • రాష్ట్ర అధ్యక్షులు డి. యం. ఓబులేసు యాదవ్**



**కడప, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కడప వైయస్సార్ ప్రెస్ క్లబ్ లో బీసీ రాజకీయ రాష్ట్ర మహాసభల కరపత్రాలు విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 78 సంవత్సరాల నుండి బీసీలను ఓట్లు వేసే ఓటర్ గా మార్చి కులగణన చేపట్టకుండా 7 శాతం అగ్రవర్ణాలే 90శాతం ఉన్న బీసీలను రాజ్యాధికారనికి దూరం చేశారాని మండిపడ్డారు ఇప్పటి వరకు ఎంతో మంది సామాజిక ఉద్యమకారులు బడుగు బలహీన వర్గాలకు జరుగుతున్న అన్యాయాలపై పోరాటాలు చేశారు. కానీ నిజంగా దేశంలో వున్న కులాల వారి జనాభాలో అగ్రకులాల చేతిలోనే ఆర్థిక, రాజకీయ, సామాజిక ఆధిపత్యం అంతా వుంది... 90%గా ఉన్న వెనుకబడిన వర్గాలు దారుణమైన స్థితిలో ఉన్నారు. స్వతంత్రం వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి గెలిచింది 10%గా ఉన్న అగ్రకులాలే. 90% శాతంగా ఉన్న క్రింది కులాలవాళ్ళు ఎన్నికలకు దూరంగా, ఓటర్లుగా మాత్రమే మిగిలారు... అసలు దేశంలోని పార్లమెంట్, అసెంబ్లీలలో ప్రాతినిధ్యం లేనప్పుడు ఏ విధంగా ఈ 90% వెనుకబడిన వారికి న్యాయం జరుగుతుంది. 10 శాతం మంది పార్లమెంట్, అసెంబ్లీలలో ఉండబట్టే ఆ వర్గాలకే ఉన్నత పదవులు, వేలకోట్ల కాంట్రాక్టులు, ఉన్నత ఉద్యోగాలు. దేశంలో ఏ ప్రభుత్వ కాంట్రాక్టు అయినా రైల్వే, రహదారి, ఓడరేవు ఇలా ఏదైనా వాళ్ళే కాంట్రాక్టర్స్... దేశంలో ఎక్కడైనా వ్యాపారాల్లో వాళ్లదే ఆధిపత్యం... కార్పొరేట్ సంస్థలు వాళ్ళవే... దేశంలో పెద్ద పరిశ్రమలు వాళ్ళ చేతుల్లోనే... మీడియా, ఫార్మసి, సినిమా, రియల్ ఎస్టేట్... అక్కడ పనిచేసే ఉద్యోగులు మాత్రం ఈ 80 శాతం ఉన్న వర్గాలవాళు... ఇన్ని ఏళ్ల వెనుకబాటు తనమే ఇప్పటి పరిస్థితికి నిదర్శనం. బిసి ఓటు బ్యాంకు కావాలి కానీ, బిసి కులాల గణన, బిసిల సంక్షేమం ఈ ప్రభుత్వాలకు అవసరం లేదు.కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ బిసి కులగణన చేసి బిసి ప్రజల హక్కులు, బిసిల వాటా విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాలలో బిసిలకు న్యాయం చేయాలని, దేశవ్యాప్త ఉద్యమంగా తీసుకెళుతామని దేశవ్యాప్త కులగణన చేయాలని, చట్టసభల్లో బిసిల వాటా కోసం డిమాండ్ చేస్తూ పార్లమెంట్లో ప్రాతినిధ్యం ఉన్న అన్ని ప్రధాన పార్టీలు, ప్రతిపక్ష నాయకులు చట్టసభల్లో బిసిల దామాషా ప్రకారం వాటా కోసం గళం విప్పాలి.చట్టసభల్లో బిసి రిజర్వేషన్ల సాధనకోసం..దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన సాధనకోసం..మహిళా రిజర్వేషన్లలో ఓబిసి మహిళలలకు సబ్కోటా సాధనకోసం..విద్య, ఉద్యోగ రంగాల్లో బిసిలకు 50% రిజర్వేషన్ల సాధనకోసం.. కేంద్ర ప్రభుత్వం కేబినెట్లో ప్రత్యేక బిసి మంత్రిత్వశాఖ ఏర్పాటు సాధనకోసం..బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ల సాధనకోసం..ఈ కార్యక్రమంలో జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున, జనతా దళ్ పార్టీ అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, బీసీ మహా సభ నేత పెంచలయ్య, అడ్వకేట్ షాలయ్య, బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు వంశీ యాదవ్, ప్రధాన కార్యదర్శి లంభోధర, ఉపాధ్యక్షులు శివ, సాంబయ్య,సుమన్ తదితరులు పాల్గొన్నారు

# రెడ్ క్రాస్ సేవలు ప్రశంసనీయం: డిఆర్ఓ మధుసూదన్ రావు

**రాయచోటి అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మానవతా సేవే రెడ్ క్రాస్ ధ్యేయమని, సేవా భావంతో పనిచేస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు ప్రశంసనీయమని డిఆర్వో మధుసూదన్ రావు తెలిపారు. శనివారం ఉదయం మాసాపేటలోని సాయి శుభా కళ్యాణమండపంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ వార్షిక సాధారణ సమావేశాన్ని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు అధ్యక్షతన నిర్వహించారు. తొలుత రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ డ్యూనంట్ చిత్రపటానికి రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులతో కలిసి డిఆర్ఓ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవ చేయాలనే ప్రతి ఒక్కరు రెడ్ క్రాస్ సభ్యత్వాన్ని తీసుకోవాలన్నారు. అన్నమయ్య జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వారు "కరుణ, నిబద్ధతతో మానవ సేవ" అనే రెడ్ క్రాస్ ధ్యేయాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అందరి సహకారంతోఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అన్నమయ్య జిల్లా శాఖను ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. **నూతన కార్యవర్గం ఏర్పాటు.** సమావేశం అనంతరం అన్నమయ్య జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు 11 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తరువాత చైర్మన్, వైస్ చైర్మన్, ట్రెజరర్ ను ఎన్నుకున్నారు.రాష్ట్ర పాలకమండలి సభ్యులు రవి ప్రకాష్ ఎన్నికల పరిశీలకుడిగా హాజరై ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. ఎన్నిక అనంతరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ 11 మంది సభ్యులచే డిఆర్ఓ ప్రమాణ స్వీకారం చేయించారు. వారిలో,డా. పి. రాజశేఖర్ రెడ్డి, చైర్మన్, రిటైర్డ్ ప్రభుత్వ అధికారి, షేక్ మొహమ్మద్ షరీఫ్ – వైస్ చైర్మన్, సామాజిక సేవకుడు, రాయచోటి,డా. వేణుగోపాల్ – ట్రెజరర్, రక్తదాత, చిట్వేల్,డా. జగదీశ్ – సభ్యులు, భారతమాత స్ఫూర్తి కేంద్రం, మదనపల్లె,డా. కె. అపర్ణ – సభ్యులు, అసోసియేట్ ప్రొఫెసర్, జేఎన్టీయూ, కలికిరి,డా. వి. ప్రతాప్ – సభ్యులు రామాపురం, డా. మహేశ్వరరాజు – ప్రభుత్వ వైద్యులు, రాయచోటి,డా. సుధాకర్ రెడ్డి – అసిస్టెంట్ డైరెక్టర్, శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల, రాయచోటిడా. మడితాటి నరసింహారెడ్డి – సభ్యులు, ఇంచార్జ్ ప్రిన్సిపల్, డైట్, రాయచోటి, శ్రీ హరీశంకర్ – సభ్యులు, ఐపీఎల్ క్రికెట్ ప్లేయర్ (సీఎస్కే), మదనపల్లె,బేబీ – సభ్యులు, అంతర్జాతీయ ఫెన్సింగ్ చాంపియన్, రాయచోటి వారు ఉన్నారు.నూతన కార్యవర్గానికి, రాష్ట్ర కార్యవర్గ కమిటీ సభ్యులుగా ఎంపికైన రాజశేఖర్ రెడ్డి కి డిఆర్ఓ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి డివిజన్ రెడ్ క్రాస్ సెక్రెటరీ శ్రీనివాసులు,భరతమాత స్ఫూర్తి కేంద్రం సభ్యులు గోవర్ధన్, గురవయ్య, కౌన్సిలర్ చంద్రశేఖర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, సాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.








# జిల్లా అధ్యక్ష, నగర కమిటీ అధ్యక్ష పదవులకు దరఖాస్తులు

**• కాంగ్రెస్ పార్టీ విధివిధానాలపై బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షులతో దిశానిర్దేశం • ఏఐసిసి అబ్జర్వర్ మహేంద్రన్**




**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష, నగర కమిటీ అధ్యక్ష పదవులకు దరఖాస్తులు అందజేయాలని, అదేవిధంగా బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షులతో కాంగ్రెస్ పార్టీ విధివిధానాలపై దిశానిర్దేశం చేయనుందని ఏఐసిసి అబ్జర్వర్ మహేంద్రన్ అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవ్ రెడ్డి భవన్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహ్మద్ జావేద్, అధ్యక్షతన శనివారం జరిగిన ప్రెస్ మీట్ లో ముఖ్యఅతిథిగా ఏఐసిసి అబ్జర్వర్ మహేంద్రన్, పిసిసి కో-ఆర్డినేటర్స్ డాక్టర్ పి. శ్రవణ్ కుమార్ రెడ్డి, రవళి రెడ్డి, రాజీవ్ రెడ్డి, చెక్కిలం రాజేశ్వరరావు లు మాట్లాడారు. **నియోజకవర్గాలలో బ్లాక్ ల వారీగా జిల్లా అబ్జర్వర్ పర్యటన వివరాలు** అక్టోబర్ 12న ఖమ్మం నగరంలోని 60 డివిజన్ లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం గంటల వరకు, 13న రఘునాథపాలెం మండలంలో ఉదయం 9 గంటల నుంచి 1:00 వరకు, సాయంత్రం జిల్లా, నగర అనుబంధ సంఘాల అధ్యక్షులతో, 14న పాలేరు నియోజకవర్గంలోని ఏ బ్లాక్ ఉదయం 9 గంటల నుండి 1 గంట వరకు బి బ్లాక్ లో, 15న సత్తుపల్లి నియోజకవర్గంలో 1వ బ్లాక్ లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు, బి బ్లాక్ లో 2 గంటల నుండి 6 గంటల వరకు, అదేవిధంగా 1 బ్లాక్ లో ఉదయం 9 నుండి మద్యాహ్నం 1 గంట వరకు, 2 బ్లాక్ లో మధ్యాహ్నం 2 గంటల నుండి 6 గంటల వరకు, 17న మధిర నియోజకవర్గంలోనీ ఏ బ్లాక్ లో 9 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 వరకు, మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 6:00 గంటల వరకు, 18న జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో డాక్టర్స్ , మేథావులతో అదేవిధంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు న్యాయవాదులు, ప్రొఫెషనల్స్ తో, చివరగా 19న ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షా పదవికి, నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవికి దరఖాస్తుదారులతో వన్ టు వన్ కార్యక్రమం నిర్వహించబడునని తెలిపారు.నగర కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్ చౌదరి, మాజీ శాసనమండలి సభ్యులు బాలసాని లక్ష్మీనారాయణ, మాజీ శాసనసభ సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చోటా బాబా, అనుబంధ సంఘాల అధ్యక్షులు వేజెండ్ల సాయికుమార్, బొడ్డు బొందయ్య, పుచ్చకాయల వీరభద్రం, మొక్క శేఖర్ గౌడ్, సయ్యద్ గౌస్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు యడ్లపల్లి సంతోష్, తదితర నాయకులు పాల్గొన్నారు

# కనీస మద్దతు ధర లేక మొక్కజొన్న రైతుల దయనీయ స్థితి



**• ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైయస్సార్‌సీపీ ఆందోళన**

**ఉరవకొండ అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తాడంగిపల్లి (శ్రీ సత్యసాయి జిల్లా), శనివారం :రాష్ట్రంలో కనీస మద్దతు ధరలు లభించక మొక్కజొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కూటమి ప్రభుత్వం రైతుల గోడును పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ శ్రీ సత్యసాయి జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైయస్సార్‌సీపీ) నేతలు రైతులను పరామర్శించి నిరసన వ్యక్తం చేశారు.శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం, రోద్దం మండలం, తాడంగిపల్లి గ్రామంలో శనివారం మొక్కజొన్న రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో, వైయస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి ఉషశ్రీ చరణ్ రైతులను కలిసి మాట్లాడారు. **అప్పుల ఊబిలోకి రైతులు: ఉషశ్రీ చరణ్** ఈ సందర్భంగా ఉషశ్రీ చరణ్ మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు."కనీస మద్దతు ధరలు లభించక, పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాక రైతులు అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు , మీ మంత్రులు, యంత్రాంగం కనీసం వారివైపు కన్నెత్తి కూడా చూడకపోవడం ధర్మమేనా?" అని ఆమె ప్రశ్నించారు.మొక్కజొన్నతో పాటు మిరప, పత్తి, జొన్న, కందులు, మినుములు, పెసలు, సజ్జలు, రాగులు, వేరుశెనగ, టమోటా, అరటి, చీని వంటి ఏ పంటకు కూడా కనీస మద్దతు ధరలు రావడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో జోక్యం చేసుకోవాల్సిన కనీస బాధ్యతను ప్రభుత్వం విస్మరించిందని, పైగా రైతులను డ్రామాలతో నిలువునా మోసం చేస్తోందని మండిపడ్డారు. **చంద్రబాబుపై మోసం ఆరోపణలు** ముఖ్యంగా మొక్కజొన్న కొనుగోలు విషయంలో చంద్రబాబు నాయుడు రైతులను మోసం చేశారని ఉషశ్రీ చరణ్ ఆరోపించారు."చంద్రబాబు గారూ... మొక్కజొన్న విషయంలో కూడా మీరు రైతులను నమ్మించి మోసం చేశారు. క్వింటాలుకు రూ.2,800కు కొంటామని చెప్పి, నాఫెడ్ కొనుగోలు చేస్తుందని మొదట నమ్మబలికారు. కానీ, ఒక్కపైసా కూడా ఖర్చు పెట్టకుండా, ఒక్క క్వింటాల్ కూడా కొనకుండా అన్నం పెట్టే రైతులకు సున్నం రాశారు," అని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు.వైయస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ధరల స్థిరీకరణ నిధి కింద రూ.3 వేల కోట్లు కేటాయించి, ఐదేళ్లలో రూ.7,796 కోట్లు ఖర్చు చేసి అనేక పంటల రైతులను ఆదుకున్నామని ఉషశ్రీ చరణ్ గుర్తు చేశారు. "మీరు కొత్తగా ఏమీ చేయకపోయినా, కనీసం మా విధానాన్ని కొనసాగించి ఉంటే రైతులకు ఊరట లభించేది కదా? ఈ ఏడాది బడ్జెట్‌లో కేవలం రూ.300 కోట్లు కేటాయించి, అందులో ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకపోవడం దారుణం కాదా?" అని నిలదీశారు. **తక్షణ జోక్యం డిమాండ్** ప్రస్తుతం ధాన్యం, కోకో, పొగాకు, ఆక్వా రైతులు సైతం ఆయా జిల్లాల్లో ఆందోళనలు చేస్తుంటే, ప్రభుత్వం రోమ్ చక్రవర్తి ఫిడేలు వాయించినట్లుగా వ్యవహరిస్తోందని ఆమె ధ్వజమెత్తారు. జనాభాలో 60 శాతం మంది ఆధారపడే వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల తీవ్ర సంక్షోభం ఏర్పడితే, లక్షల మంది ఉపాధికి గండిపడితే దానికి ఎవరు బాధ్యత తీసుకుంటారని ఆమె ప్రశ్నించారు.వెంటనే ప్రభుత్వం మార్కెట్లో జోక్యం చేసుకోవాలని, కనీస ధరలు లభించని పంటల విషయంలో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర కల్పించాలని ఉషశ్రీ చరణ్ డిమాండ్ చేశారు.